PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

పక్కా తెలుగు | 5 DOTS NETWORK

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 015 | గురువారం | 09-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 015 | Thursday | 09-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri


వివరాలు7లో..

# రావణకాండ

జస్ట్ ఆస్కింగ్ అంటూ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ చేసే ట్వీట్‌ల స్ఫూర్తితో యూట్యూబర్ ప్రశ్న రావణ్ లేవనెత్తిన వివాదాస్పద ప్రశ్నలతో చివరకి ఆయన, జీవితం ప్రశ్నార్థకంగా మారింది. పుట్టలో వేలు పెడితే కుట్టనా అన్న చందంగా రావణ్ సనాతన ధర్మం పుట్టలో వేలు పెట్టడంతో అందులోని వివాదాస్పద అంశాలు ఆయన మెడకు సర్పాలుగా చుట్టుకున్నాయ్. అసలు విషయాన్ని పక్కదారి పట్టించి ఒక మతాన్ని టార్గెట్ చేశారన్నది రావణ్‌పై వస్తున్న విమర్శ. శృతి మించితే సరసం విరసం ఐనట్లు... విమర్శల విషయంలో లక్ష్మణ రేఖను దాటడంతో రావణ్‌కు లక్ష చిక్కులు వచ్చి పడ్డాయ్. చివరకు నిన్నటి వరకు రావణ్‌ను వెనుకేసుకొచ్చిన కొన్ని వర్గాలు కూడా... తాజాగా తలెత్తిన కాంట్రవర్శీని చూసి వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ విమర్శకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలనుకున్న రావణ్‌ను చివరకు పొలిటికల్ ఎపిసోడ్‌లో విలన్‌గా చిత్రీకరించే పరిస్థితి ఉత్పన్నమైంది. ఇందులో సదరు యూట్యూబర్ స్వయంకృతాపరాధం ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. వాక్ స్వాతంత్ర్యం పేరుతోటి హద్దులు దాటి మాట్లాడితే ఏం జరుగుతుందో రావణ్ ఉదంతం ఒక ఉదాహరణ. రాజకీయంగా ఎన్ని విమర్శలైనా చేయొచ్చేమో గానీ.. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నది రావణ్ విషయంలో స్పష్టమవుతోంది. ఈ రోజు ఏపీ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. రావణ్ ఉదంతంపై మంత్రి ఆనంతోపాటు, పలువురు నేతల స్పందించారు.

## రావణ్‌కు మద్దతుపై ఆనం ఆగ్రహం

- హిందూ మనోభావాలే ముఖ్యమని వ్యాఖ్య
- వైసీపీ తీరుపై మంత్రి తీవ్ర విమర్శలు





## హిందువుల మనోభావాలే ముఖ్యం

రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ సత్యకుమార్

## తప్పుడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

జోసెఫ్ రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ విజయసాయి రెడ్డి





## రావణ్‌కు వైసీపీతో సంబంధం లేదు

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజం

అంతా టీడీపీ కుట్రేనన్న కొడాలి నాని

## మెస్ ఛార్జీలు 10 శాతం పెంపు

# హాస్టళ్లు, గురుకులాలకు శుభవార్త

రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెస్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో సంక్షేమ శాఖల మంత్రులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన మెస్ ఛార్జీలతో విద్యార్థులకు మరింత నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు అవకాశం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. సమీక్షలో హాస్టళ్లు, గురుకులాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా ప్రత్యేకంగా చర్చించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) పాఠశాలల శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.500 కోట్లను మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయనుంది. మెస్ ఛార్జీల పెంపు నిర్ణయంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పెరిగిన నిధులతో విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టళ్లు, గురుకులాల్లో సొంత ఇంటి వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారని తెలిపారు.



# దక్షిణ కొరియాలో లోకేశ్ దూకుడు

**• కుప్పం నియోజకవర్గంపై ఫోకస్ • ఫుట్‌వేర్ రంగంలో భారీ ప్రణాళికలు**


2లో..

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. బుసాన్‌లో హ్వాసంగ్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో భారీ ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్ ఏర్పాటుపై చర్చించారు. కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్, మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. నెక్స్ట్‌జెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ పరిశోధన కేంద్రం, ఆసియా పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఏపీలో స్థాపించాలని కోరారు. తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

**రూ.900 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్**


కుప్పంలో రూ.900 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ నాన్‌లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు హ్వాసంగ్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా ఏడాదికి రెండు కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అడిడాస్ సహా పలు అంతర్జాతీయ బ్రాండ్లకు సరఫరాలు చేసే స్థాయిలో ఈ యూనిట్ పనిచేస్తుందని వివరించారు. తొలి దశలో ఎగుమతులపై దృష్టి పెట్టి, ఆ తర్వాత దేశీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.


2లో..

## తిరుమల వెళ్తున్నారా?

వీఐపీ బ్రేక్ దర్శనాలకు బ్రేక్ • ముఖ్య పండుగల వేళ టీటీడీ నిర్ణయం

భక్తులకు కీలక సూచనలు


2లో..

## తమిళనాడు కీలక నిర్ణయం

- ఫీజులన్నీ బహిరంగం చేయాల్సిందే
- ప్రైవేట్ స్కూళ్లకు హైకోర్టు షాక్


2లో..

## విద్యారంగంలో కొత్త మైలురాయి

- దేశంలో కోటి మందికిపైగా అధ్యాపకులు
- 14 లక్షల స్కూళ్లు, 24 కోట్ల మంది విద్యార్థులు
- యూడైస్ నివేదికలో కీలక గణాంకాలు

## మత్స్యకార కుటుంబాలకు భరోసా

పదిలక్షల చొప్పన పరిహారం అందించిన మంత్రి కొల్లు

గల్లంతయిన వారి జాడ తెలియక కుటుంబాల్లో విషాదం


2లో..

విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ బీమా పథకం కింద రూ.5 లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరో రూ.5 లక్షలు అందించారు. మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న 63 బీమా క్లెయిమ్‌లను కూడా పరిష్కరించి రూ.3.15 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు.


7లో..

## ఆళ్లగడ్డలో హైటెన్షన్

అహోబిలం తలనీలాల సెగ • ఆరోపణలపై పొలిటికల్ వార్

సవాళ్లతో వేడెక్కిన రాజకీయం




- ఒకే వేరుకు పుట్టిన కొమ్మలు • రాజకీయం వేరు చేసిన దారులు
- తల్లడిల్లుతున్న తల్లి హృదయం • వైఎస్ జయంతి వేళ విజయమ్మ మౌనం
- విడిపోయిన కుటుంబానికి అద్దం పట్టిన ఆవేదన

రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉండొచ్చు... సిద్ధాంతాలు వేర్వేరు కావొచ్చు...అధికారాలు మారొచ్చు. కానీ ఒక తల్లి మనసులో మాత్రం రాజకీయాలకు చోటుండదు. ఆమెకు కొడుకైనా ఒకటే... కూతురైనా ఒకటే. ఆ ప్రేమకు పార్టీ రంగులు ఉండవు... పదవుల గీతలు ఉండవు... గెలుపోటముల లెక్కలు ఉండవు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు మరోసారి ఒక కుటుంబంలోని భావోద్వేగాలను ప్రజల ముందుంచాయి. రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్‌ను స్మరించుకునేందుకు వేలాది మంది అభిమానులు, నాయకులు నివాళులర్పించారు.

(వివరాలు 2లో..)





## వైఎస్సార్‌కు ఘన నివాళి

**ఇడుపులపాయలో భావోద్వేగం**

దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఘాట్ వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సతీమణి విజయమ్మ, భారతి సహా కుటుంబ సభ్యులు పాల్గొని మహానేతను స్మరించుకున్నారు.

(వివరాలు 2లో..)



### రాజకీయ సహజీవనం..

## రాంగ్ రూటులో ప్రేమాయణం

**ఏరులై పారుతున్న ప్రేమరసం**

**తేలిపోతుందా? పేలిపోతుందా?**

**క్లైమాక్సా... యాంటీ క్లైమాక్సా..?**

**దువ్వాడ–దివ్వెల ప్రేమకథ హిట్టా... ఫట్టా!**

**సహజీవన రాజకీయం టెక్కలిలో రక్తికడుతుందా?**

రాజకీయాల్లో సాధారణంగా కథ మొదలవుతుంది సభతో... ముగుస్తుంది ఎన్నికలతో. కానీ ఈ జంట కథ మాత్రం ప్రేమతో మొదలై, మీడియా కెమెరాల మధ్య పెరిగి, సోషల్ మీడియా రీల్స్‌లో పరుగెత్తి, ఇప్పుడు రాజకీయ క్లైమాక్స్ కోసం ఎదురుచూస్తున్న సీరియల్‌గా మారింది. ఒకప్పుడు పార్టీ జెండా మోసిన చేతులు... ఇప్పుడు ప్రేమకు చప్పట్లు కొడుతున్నాయా? లేక రాజకీయ భవిష్యత్తుకు ఓట్లు అడగడానికి సిద్ధమవుతున్నాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రేమకు దర్శకుడు విధి అయితే, ప్రచారానికి నిర్మాత సోషల్ మీడియా అన్నట్టుగా ప్రతి మలుపు వైరల్ అవుతోంది. ప్రతి ఎపిసోడ్‌కు కొత్త ట్విస్ట్, ప్రతి ట్విస్ట్‌కు కొత్త డిబేట్, ప్రతి డిబేట్‌కు కొత్త రీల్... ఇదే దువ్వాడ-దివ్వెల కథ ప్రత్యేకత. ఇక అసలు ప్రశ్న ఒక్కటే... ఈ ప్రేమకథకు చివర్లో "హ్యాపీ ఎండింగ్" కార్డు పడుతుందా? లేక రాజకీయ తెరపై యాంటీ క్లైమాక్స్‌తో ముగుస్తుందా? ఓటర్లు చప్పట్లు కొడతారా, తీర్పు చెబుతారా, లేక ఈ కథను మరో వైరల్ జ్ఞాపకంగా పక్కన పెట్టేస్తారా? సమాధానం మాత్రం రాబోయే రాజకీయ కాలమే రాయాల్సి ఉంది. (వివరాలు 7లో..)



# దక్షిణ కొరియాలో లోకేశ్ దూకుడు

(మొదటి పేజీ తరువాయి..)
బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అత్యాధునిక సాంకేతికతతో తయారవుతున్న పాదరక్షల తయారీ విధానాన్ని పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లు, వైబ్రేషన్ టెక్నాలజీ ఆధారంగా రూపొందిస్తున్న షూల ప్రత్యేకతలను తెలుసుకున్నారు. రక్తప్రసరణ మెరుగుపరచడం, కండరాల అలసట తగ్గించడం వంటి ప్రయోజనాలపై సంస్థ ప్రతినిధులు వివరించారు.

### బూ యంగ్ గ్రూప్‌కూ ఆహ్వానం

పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్ తయారీలో ప్రముఖ సంస్థ బూ యంగ్ గ్రూప్ ప్రతినిధులతో కూడా లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు, పారిశ్రామిక జోన్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ పర్యటన ద్వారా ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించి కుప్పాన్ని దక్షిణ భారత ఫుట్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

## జమ్మలమడుగుకు మంత్రి లోకేశ్

- దాల్మియా విస్తరణకు భూమిపూజ
- టీడీపీ కార్యకర్తలతో సమావేశం

కడప జిల్లా జమ్మలమడుగుకు ఈనెల 14న మంత్రి నారా లోకేశ్ రానున్నారు. మైలవరం మండలంలోని చిన్న కొమెర్ల పరిధిలో దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 14వ తేదీన జమ్మలమడుగులో బస చేసిన అనంతరం 15వ తేదీ ఉదయం ప్లాంట్ విస్తరణకు భూమిపూజ నిర్వహించనున్నారు. తర్వాత మైదుకూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక నేతలు ఏర్పాట్లు వేగవంతం చేశారు.

## మైదుకూరులో టేకు చెట్ల మిస్టరీ

- మున్సిపల్ కార్యాలయంలో మాయం
- రాత్రికి రాత్రే తరలించేసిన వైనం



కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. లక్షల రూపాయల విలువ చేసే దాదాపు 20 టేకు చెట్లు రాత్రికి రాత్రే నరికి తరలించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అదీ మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగానే ఈ ఘటన జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంత పెద్ద స్థాయిలో చెట్లను తరలిస్తే అధికారులకు తెలియలేదా? తెలిసి కూడా మౌనం పాటించారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తికి చిన్న నష్టం జరిగినా కేసులు నమోదు చేసే పరిస్థితిలో, విలువైన టేకు చెట్లు కనిపించకుండా పోయినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం విమర్శలకు దారితీసింది. అధికారులు మాత్రం తమకు సంబంధం లేదని చెబుతుండటం సందేహాలను మరింత పెంచుతోంది. అభివృద్ధి పనుల కోసమే చెట్లను తొలగించి ఉంటే నిబంధనల ప్రకారం అనుమతులు, వేలం ప్రక్రియ జరిగిందా అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లేదు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన వారెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.


## తిరుమల వెళ్తున్నారా?

- వీఐపీ బ్రేక్ దర్శనాలకు బ్రేక్
- కీలక పండుగల వేళ టీటీడీ నిర్ణయం
- భక్తులకు కీలక సూచనలు

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే ప్రధాన ఆధ్యాత్మిక ఉత్సవాలు, ప్రత్యేక ఆలయ కార్యక్రమాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. జూలై 30 నుంచి సెప్టెంబర్ 30 వరకు వివిధ తేదీల్లో ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని టీటీడీ ప్రకటించింది. ఆలయ సంప్రదాయాలు, ప్రత్యేక పూజలు, ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. తిరుమల యాత్రకు వచ్చే భక్తులు ముందుగానే దర్శన షెడ్యూల్‌ను పరిశీలించి ప్రయాణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

### ఏయే రోజుల్లో వీఐపీ దర్శనాలు ఉండవు?

జూలై 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జూలై 17న ఆనివార ఆస్థానం, జూలై 19న శ్రీ అండవన్ ఆశ్రమ స్వామీజీకి పెద్ద మర్యాద, జూలై 29న తిరుమల జీయర్ స్వాముల చాతుర్మాస్య సంకల్పం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. అలాగే ఆగస్టు 22న పవిత్రోత్సవాల అంకురార్పణ, ఆగస్టు 24న పవిత్ర సమర్పణ కార్యక్రమం కారణంగా కూడా వీఐపీ దర్శనాలు ఉండవు. సెప్టెంబర్ 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబర్ 14న అంకురార్పణ, సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు జరిగే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల మొత్తం కాలంలో కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు పూర్తిగా నిలిపివేయనున్నారు.



### సిఫార్సు లేఖలకు కూడా అవకాశం లేదు

ప్రకటించిన ప్రతి తేదీకి ముందు రోజు వీఐపీ సిఫార్సు లేఖలను కూడా స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం అర్హత కలిగిన ప్రముఖులకు ఈ నిబంధన వర్తించదని తెలిపింది. సాధారణ భక్తుల దర్శనానికి ఇబ్బందులు తలెత్తకుండా, ఆలయ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

### భక్తులు ముందస్తు ప్రణాళికతో రావాలి

పండుగల కాలంలో తిరుమలకు భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున యాత్రికులు తమ దర్శన తేదీలను ముందుగానే ఖరారు చేసుకోవాలని టీటీడీ సూచించింది. వీఐపీ దర్శనాలపై ఆధారపడకుండా అందుబాటులో ఉన్న సాధారణ దర్శన విధానాలను వినియోగించుకోవాలని కోరింది. తాజా షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ ప్రణాళిక రూపొందిస్తే అనవసర ఇబ్బందులు తప్పుతాయని అధికారులు తెలిపారు. తిరుమలలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భంగం కలగకుండా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని టీటీడీ స్పష్టం చేసింది.




- ఒకే వేరుకు పుట్టిన కొమ్మలు
- రాజకీయం వేరు చేసిన దారులు
- తల్లడిల్లుతున్న తల్లి హృదయం
- వైఎస్ జయంతి వేళ విజయమ్మ మౌనం
- విడిపోయిన కుటుంబానికి అద్దం పట్టిన ఆవేదన

రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉండొచ్చు... సిద్ధాంతాలు వేర్వేరు కావొచ్చు... అధికారాలు మారొచ్చు. కానీ ఒక తల్లి మనసులో మాత్రం రాజకీయాలకు చోటుండదు. ఆమెకు కొడుకైనా ఒకటే... కూతురైనా ఒకటే. ఆ ప్రేమకు పార్టీ రంగులు ఉండవు... పదవుల గీతలు ఉండవు... గెలుపోటముల లెక్కలు ఉండవు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు మరోసారి ఒక కుటుంబంలోని భావోద్వేగాలను ప్రజల ముందుంచాయి. రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్‌ను స్మరించుకునేందుకు వేలాది మంది అభిమానులు, నాయకులు నివాళులర్పించారు. అయితే అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం ఒక తల్లి అడుగులు.

ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప జిల్లా ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో తన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తండ్రిని స్మరించుకున్నారు. ఆయన వెంట విజయమ్మ నడిచారు. కొడుకును ఆశీర్వదించారు. తల్లి ప్రేమను మరోసారి చాటిచెప్పారు. అదే రోజు మరోవైపు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన తండ్రి ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఆమె వెంట కూడా విజయమ్మే కనిపించారు. కుమార్తెతో కలిసి ఘాట్ వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. ఒకే రోజు... ఇద్దరు పిల్లలతో రెండు వేదికలు... రెండు కార్యక్రమాలు... కానీ ఒకే తల్లి. ఈ దృశ్యాలు కేవలం రాజకీయ వార్తలు మాత్రమే కాదు. ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసే భావోద్వేగ క్షణాలు కూడా.

### రాజకీయాల మధ్య తల్లి మమకారం

ఒకప్పుడు ఒకే ఇంట్లో కలిసి పెరిగిన అన్నాచెల్లెలు... ఒకే తండ్రి ఆశయాల గురించి మాట్లాడిన వారు... ఈరోజు రాజకీయంగా వేర్వేరు దారుల్లో నడుస్తున్నారు. అభిప్రాయ భేదాలు వ్యక్తిగత దూరాలకు దారితీశాయి. ఆ దూరం ఇప్పుడు కుటుంబ కార్యక్రమాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. తండ్రి జయంతి వంటి సందర్భంలోనూ ఒకే వేదికపై కనిపించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో విజయమ్మ పాత్ర ఎంతో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఆమె ఎవరి వైపూ నిలబడలేదు. ఎవరినీ వదిలిపెట్టలేదు. కొడుకు పక్కన నడిచారు. కుమార్తెతోనూ నడిచారు. ఒకరిని ఎంచుకుని మరొకరిని దూరం చేయలేదు. ఎందుకంటే తల్లి హృదయంలో అలాంటి విభజనలు ఉండవు. ఒక తల్లి జీవితంలో పిల్లలు ఎంత పెద్ద నాయకులైనా... ఎంత పెద్ద పదవుల్లో ఉన్నా... ఎంతటి రాజకీయ శక్తులైనా... ఆమె కళ్లలో మాత్రం వారు చిన్న పిల్లలే. వారి విజయాలు చూసి ఆనందపడేది కూడా ఆమెనే. వారి మధ్య దూరం చూసి మౌనంగా బాధపడేది కూడా ఆమెనే. విజయమ్మ ముఖంలో కనిపించిన ప్రశాంతత వెనుక ఎన్నో చెప్పలేని భావోద్వేగాలు దాగి ఉన్నాయేమో అన్న భావన చాలా మందికి కలిగింది.

### విజయమ్మ అడుగుల్లో మానవీయత

బయటకు చిరునవ్వు కనిపించినా... మనసులో మాత్రం ఇద్దరు పిల్లలు ఒకే వేదికపై కలిసి నిలబడాలని కోరుకునే తల్లి ఆకాంక్ష ఉండదా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. వైఎస్సార్ తన జీవితమంతా కుటుంబ విలువలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజల మధ్య ఉంటూనే కుటుంబాన్ని కూడా సమానంగా చూసుకున్న వ్యక్తిగా ఆయన గురించి అనేక మంది చెప్పుకుంటారు. అలాంటి నాయకుడి జయంతి వేళ ఆయన కుటుంబం విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించడం అనేది అభిమానుల్లో కూడా భావోద్వేగాలను రేకెత్తించింది. రాజకీయాల్లో విభేదాలు సహజం. సిద్ధాంతాలు వేరుగా ఉండటం ప్రజాస్వామ్యంలో భాగం. కానీ కుటుంబ బంధాలు మాత్రం రాజకీయాలకు అతీతంగా ఉండాలని కోరుకునే వారు ఎందరో ఉన్నారు. అందుకే విజయమ్మ అడుగులు ఈసారి రాజకీయాల కంటే ఎక్కువగా మానవీయ కోణాన్ని గుర్తు చేశాయి. తల్లి బాధలను మాటల్లో చెప్పడం అంత సులభం కాదు. పిల్లలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటే... తల్లి మాత్రం ఇద్దరి క్షేమం కోసం ప్రార్థిస్తుంది. ఒకరు బాధపడితే ఆమె మనసు కలత చెందుతుంది. మరొకరు ఇబ్బందుల్లో ఉంటే అదే హృదయం కరిగిపోతుంది. తల్లి ప్రేమకు పక్షపాతం ఉండదు.

### ఇద్దరు పిల్లలు.. ఒక్క తల్లి హృదయం

వైఎస్సార్ 77వ జయంతి వేడుకల్లో విజయమ్మ చేసిన ప్రయాణం కూడా అలాంటిదే. ఒక చేతిలో కొడుకు... మరో చేతిలో కుమార్తె. ఇద్దరినీ వదలని తల్లి. ఇద్దరికీ అండగా నిలవాలనుకునే తల్లి. రాజకీయాల కంటే బంధాలకు విలువ ఇచ్చే తల్లి. ఈ దృశ్యాలు చివరికి ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చాయి. రాజకీయాలు మనుషులను వేరు చేయవచ్చు. పదవులు దూరం చేయవచ్చు. అభిప్రాయాలు విభజించవచ్చు. కానీ తల్లి ప్రేమను మాత్రం ఎలాంటి గోడలు ఆపలేవు. వైఎస్సార్‌ను కోట్లాది మంది "ప్రజానేత"గా గుర్తుంచుకుంటారు. కానీ విజయమ్మ మనసులో ఆయన ముందుగా భర్త... జగన్, షర్మిలలు ముందుగా తన పిల్లలు. ఆ తల్లి హృదయం కోరుకునేది ఒకటే అయి ఉండొచ్చు— వేదికలు వేరైనా, మార్గాలు వేరైనా, ఎప్పటికైనా కుటుంబ బంధాలు మళ్లీ కలవాలని. ఆ ఆశ నెరవేరుతుందో లేదో కాలమే చెప్పాలి. కానీ వైఎస్సార్ 77వ జయంతి రోజున విజయమ్మ వేసిన ఆ రెండు అడుగులు మాత్రం ఒక తల్లి ప్రేమకు, త్యాగానికి, ఆవేదనకు చిరస్థాయిగా నిలిచిపోయే ప్రతీకగా మిగిలిపోయాయి.

## వైఎస్సార్‌కు ఘన నివాళి

- ఇడుపులపాయలో భావోద్వేగం

దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఘాట్ వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సతీమణి విజయమ్మ, భారతి సహా కుటుంబ సభ్యులు పాల్గొని మహానేతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ప్రజాసేవ, సంక్షేమ పాలన, రైతుల పట్ల చూపిన అంకితభావాన్ని నాయకులు గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన నాయకుడిగా వైఎస్సార్ నిలిచిపోయారని కొనియాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ తనయ వైఎస్ షర్మిల, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు. కాలం మారినా వైఎస్సార్ పేరు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ప్రజల కోసం అంకితమైన ఆయన జీవితం ఎప్పటికీ ఆదర్శంగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే విలువలకు వైఎస్సార్ శాశ్వత చిరునామాగా నిలిచారని వారు గుర్తుచేశారు.



## మత్స్యకార కుటుంబాలకు భరోసా

- పదిలక్షల చొప్పున పరిహారం అందించిన మంత్రి కొల్లు
- గల్లంతయిన వారి జాడ తెలియక కుటుంబాల్లో విషాదం

విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ బీమా పథకం కింద రూ.5 లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరో రూ.5 లక్షలు అందించారు. మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న 63 బీమా క్లెయిమ్‌లను కూడా పరిష్కరించి రూ.3.15 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు.

### కుటుంబాల ఆవేదనకు అంతులేదు

మంత్రి రాక సందర్భంగా బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. తమ కుటుంబ సభ్యులను రక్షించకుండా పరిహారం ఇవ్వడానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించాయి. చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయం వద్ద మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. గల్లంతైన వారి జాడ కోసం ఇప్పటికీ ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బోటు యజమాని కారి చిన్న తన కళ్ల ఎదుటే సహచరులు సముద్రంలో కొట్టుకుపోయారని చెప్పడంతో కుటుంబాల్లో ఆందోళన మరింత పెరిగింది. ఇంటి పెద్దల ఆచూకీ లేక పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియక పలువురు మహిళలు విలపించారు.



రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

బాధిత కుటుంబాలు ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఇంటికి ఒక ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాయి. పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని విజ్ఞప్తి చేశాయి. ఆర్థిక సాయం మాత్రమే కాకుండా శాశ్వత భరోసా కల్పించాలని డిమాండ్ చేశాయి. మత్స్యశాఖ అధికారులు, కమిషనర్‌కు తమ వినతులను వివరించాయి. ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని దీర్ఘకాలిక సహాయం ప్రకటించాలని కోరాయి.

### సమాచార లోపంపై ప్రశ్నలు

ప్రమాదం జరిగిన సమాచారం జూలై 4 సాయంత్రానికే మత్స్యకార సంఘాల నాయకులకు చేరినా, అధికారులకు ఆలస్యంగా చేరడంతో గాలింపు చర్యలు ఆలస్యమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమాచారం వెంటనే చేరి ఉంటే అదే రోజు రక్షణ చర్యలు ప్రారంభించే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఈ అంశంపై జిల్లా యంత్రాంగం కూడా దృష్టిసారించింది. సమాచార వ్యవస్థలో జరిగిన లోపాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల కోసం సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, వారి కుటుంబాలకు అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.

## విద్యారంగంలో కొత్త మైలు రాయి

- దేశంలో కోటి మందికిపైగా అధ్యాపకులు
- 14 లక్షల స్కూళ్లు, 24 కోట్ల మంది విద్యార్థులు
- యూడైస్ నివేదికలో కీలక గణాంకాలు



దేశ విద్యారంగంలో మరో కీలక మైలురాయి నమోదైంది. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన యూడైస్ ప్లస్ ఆధారిత పనితీరు గ్రేడింగ్ సూచీ, జిల్లా పనితీరు గ్రేడింగ్ సూచీ 202526 నివేదికల ప్రకారం దేశంలో తొలిసారిగా ఉపాధ్యాయుల సంఖ్య కోటి మార్కును దాటింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.03 కోట్లకుపైగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో 24.72 కోట్ల మంది విద్యార్థులు 14.67 లక్షల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. భారత విద్యా వ్యవస్థ విస్తరణకు ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

### రాష్ట్రాల పనితీరుకు ప్రత్యేక అంచనా

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యా వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి పనితీరు గ్రేడింగ్ సూచీ రూపొందించారు. ర్యాంకులు ప్రకటించే విధానానికి బదులుగా పనితీరు ఆధారంగా వివిధ గ్రేడ్‌లలో రాష్ట్రాలను వర్గీకరించారు. మొత్తం 1,000 మార్కులతో 70 సూచికల ఆధారంగా ఈ అంచనా నిర్వహించారు. అభ్యాస ఫలితాలు, విద్యా నాణ్యత, విద్య అందుబాటు, మౌలిక వసతులు, సమాన అవకాశాలు, పాలన, ఉపాధ్యాయ శిక్షణ వంటి ప్రధాన అంశాలను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. యూడైస్ ప్లస్, పరఖ్ జాతీయ సర్వే-2024, పీఎం పోషణ్ పోర్టల్, ప్రభంధ్ పోర్టల్, విద్యాంజలి పోర్టల్‌లలోని సమాచారాన్ని విశ్లేషించి నివేదిక రూపొందించారు.

### జిల్లాలకూ పనితీరు సూచీ

జిల్లా స్థాయిలో కూడా విద్యా ప్రమాణాలను అంచనా వేయడానికి పీజీఐడి అమలు చేస్తున్నారు. మొత్తం 600 మార్కులతో 70 సూచికల ఆధారంగా జిల్లాల పనితీరును విశ్లేషించారు. విద్యా ఫలితాలు, తరగతి గది బోధన, మౌలిక వసతులు, విద్యార్థుల హక్కులు, పాఠశాల భద్రత, బాలల రక్షణ, డిజిటల్ విద్య వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఉపాధ్యాయుల లభ్యత, వృత్తిపరమైన అభివృద్ధి, నిధుల వినియోగం, హాజరు పర్యవేక్షణ, పాఠశాల నాయకత్వం వంటి అంశాలు కూడా ఈ అంచనాలో భాగమయ్యాయి.

### విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం

తాజా నివేదిక దేశంలోని పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి కీలక మార్గదర్శకంగా నిలవనుంది.

## తమిళనాడు కీలక నిర్ణయం

- ఫీజులన్నీ బహిరంగం చేయాల్సిందే
- ప్రైవేట్ స్కూళ్లకు హైకోర్టు షాక్

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల విషయంలో పారదర్శకత తీసుకురావాలని మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తమిళనాడులోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజు వివరాలను తప్పనిసరిగా పాఠశాల నోటీసు బోర్డుపై, అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద ఉన్న అధికారాలను వినియోగిస్తూ జస్టిస్ ఎం. ధండపాణి ఈ తీర్పు ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి సమాచారం తెలుసుకుని నిర్ణయం తీసుకునేలా ఈ చర్యలు అవసరమని కోర్టు పేర్కొంది.

### ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులే చూపాలి

ప్రభుత్వం నియమించిన ఫీజు నిర్ధారణ కమిటీ నిర్ణయించిన మొత్తాన్నే పాఠశాలలు ప్రదర్శించాలని కోర్టు స్పష్టం చేసింది. సంబంధిత అధికారుల అనుమతితో వసూలు చేసే అదనపు ఫీజులను కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆదేశించింది. ఫీజు వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించే బాధ్యత పాఠశాల యాజమాన్యాలదేనని తెలిపింది. ఈ ప్రక్రియను ప్రైవేట్ పాఠశాలల డైరెక్టర్ పర్యవేక్షించాలని కూడా సూచించింది. దీంతో ఫీజుల విషయంలో గందరగోళానికి తెరపడే అవకాశం ఉందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

### పాఠశాలల వాదనను పరిశీలించిన కోర్టు

సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రజా సంస్థలు కావని పేర్కొంటూ ప్రైవేట్ పాఠశాలల సంఘం కోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల ఆధారంగా జారీ చేసిన సర్క్యులర్ చట్టబద్ధం కాదని వాదించింది. ఈ అంశంలో కొంత వరకు వాదన సమంజసమేనని కోర్టు అభిప్రాయపడింది. అయినప్పటికీ ఫీజు వివరాలను బహిరంగంగా ప్రకటించాలనే విషయంలో మాత్రం ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు.



### తల్లిదండ్రుల ప్రయోజనాలకే ప్రాధాన్యం

ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియంత్రణ చట్టం పరిధిలో పనిచేస్తున్నందున ప్రజలకు అవసరమైన సమాచారాన్ని వెల్లడించే బాధ్యత వాటిపై ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే నిర్ణయం తీసుకునే ముందు ఫీజులపై పూర్తి అవగాహన తల్లిదండ్రులకు ఉండాలని పేర్కొంది. ముందస్తు సమాచారం లేక అధిక ఫీజుల భారం మోయాల్సిన పరిస్థితులు తగ్గుతాయని అభిప్రాయపడింది. ఈ తీర్పుతో విద్యా రంగంలో పారదర్శకత పెరగడంతో పాటు పాఠశాలల జవాబుదారీతనం కూడా బలోపేతం అవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి విధానాలను అమలు చేసే అవకాశాలపై ఇప్పుడు చర్చ మొదలైంది.

# యూఎస్-ఇరాన్ ఉద్రిక్తతలు

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్

- ₹ 8 లక్షల కోట్ల సంపద ఆవిరి
- పెట్టుబడిదారులకు భారీ షాక్

భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీ పతనాన్ని చవిచూసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళన పెరిగింది. అదే ప్రభావం దేశీయ మార్కెట్ పై కూడా పడింది. ఒక్కరోజులోనే పెట్టుబడిదారుల సంపద దాదాపు రూ.7.89 లక్షల కోట్లు తగ్గిపోయింది. గత మూడు నెలల్లో నమోదైన అతిపెద్ద ఒక్కరోజు పతనంగా ఈ పరిణామం నిలిచింది.

## సెన్సెక్స్, నిఫ్టీకి భారీ దెబ్బ

మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,677.12 పాయింట్లు పడిపోయి 76,503.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 516.65 పాయింట్లు కోల్పోయి 23,882.05 వద్ద స్థిరపడింది. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయనే భయంతో పెట్టుబడిదారులు పెద్దఎత్తున అమ్మకాలకు దిగారు. ఈ పతనానికి ప్రధాన కారణం బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో భారీ అమ్మకాలు కావడం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ అండ్ టుబ్రో, భారతి ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీపై అత్యధిక ప్రతికూల ప్రభావం చూపాయి. ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరే నిఫ్టీ నుంచి 66 పాయింట్లకు పైగా తగ్గించింది. మిగతా ప్రధాన షేర్లు కూడా గణనీయంగా క్షీణించడంతో సూచీలు వేగంగా దిగజారాయి.

## ట్రంప్ వ్యాఖ్యలతో పెరిగిన భయం

దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాలతోనే ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 2.72 శాతం పడిపోగా, నిఫ్టీ బ్యాంక్ 2.51 శాతం క్షీణించింది. ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్,



మీడియా, గ్రామీణ రంగ సూచీలు కూడా రెండు శాతానికి సమీపంలో నష్టపోయాయి. ఐటీ, ఫార్మా, మెటల్ రంగాలు కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, హిందాల్కో షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేసినా మొత్తం మార్కెట్‌ను నిలబెట్టలేకపోయాయి. అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయనే సంకేతాలు పెట్టుబడిదారుల్లో ఆందోళనకు కారణమయ్యాయి. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడుల తర్వాత అమెరికా ఇరాన్‌పై సైనిక చర్యలు చేపట్టింది. చమురు లావాదేవీలకు ఇచ్చిన సడలింపులను కూడా అమెరికా రద్దు చేసింది. ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతాయనే అంచనాలతో మార్కెట్‌లో భయాందోళనలు పెరిగాయి.

## ముందు రోజులు ఎలా ఉంటాయి?

ప్రపంచ భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగితే మార్కెట్లలో ఒడిదుడుకులు మరికొంత కాలం కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. విదేశీ పరిణామాలు ప్రస్తుతం దేశీయ మార్కెట్ పై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ఇంధన ధరలు, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు రాబోయే రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశముంది. పెట్టుబడిదారులు భావోద్వేగ నిర్ణయాలకు దూరంగా ఉండి దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడులను సమీక్షించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# హెచ్1బీ వీసాలపై ఉక్కుపాదం

- మోసాల దర్యాప్తు అమెరికా విచారణ
- కాగ్నిజెంట్ పేరును ప్రస్తావన
- భారత ఐటీ రంగంలో ఆందోళన

అమెరికాలో హెచ్1బీ, పర్మ్ ఉద్యోగ వీసాలకు సంబంధించిన అక్రమాలపై ట్రంప్ ప్రభుత్వం తొలి భారీ దర్యాప్తు ప్రారంభించింది. అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో ఈ విషయాన్ని వెల్లడించారు. విదేశీ కార్మికుల నియామకాల్లో మోసాలు, కార్మికుల దోపిడీ, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన ఆరోపణలపై ఇప్పటికే డజన్ల కొద్దీ సమన్లు జారీ చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో లభించే ప్రతి ఆధారాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సందర్భంగా సమాచారదారులు కొన్ని ప్రముఖ సంస్థలపై కూడా ఫిర్యాదులు చేశారని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కాగ్నిజెంట్ పేరును కూడా ప్రస్తావించారు. అయితే సంస్థపై ఎలాంటి తప్పిదం నిర్ధారణ కాలేదని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

దర్యాప్తు ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగ వీసా పథకాల దుర్వినియోగం వల్ల అమెరికా ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని కార్మిక శాఖ అభిప్రాయపడింది. నకిలీ దరఖాస్తులు, వేతనాల దుర్వినియోగం, విదేశీ కార్మికులపై ఒత్తిడి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించింది. ఈ అక్రమాలను అరికట్టేందుకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి మోసాల నిరోధక బృందంతో కలిసి దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది వేలాది మంది భారతీయ నిపుణులు హెచ్1బీ వీసాలతో అమెరికాకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో తాజా దర్యాప్తు ఐటీ రంగంలో చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు ఫలితాలు వెలువడే వరకు పరిస్థితిని నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కో రోజు ఒక్కో ప్రకటన చేస్తూ ప్రపంచ రాజకీయాలను మరింత అనిశ్చితిలోకి నెడుతున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ఒకవైపు శాంతి చర్చల మాటలు... మరోవైపు సైనిక హెచ్చరికలు, ఆంక్షలు, ఘాటు వ్యాఖ్యలు అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ఇంకా పూర్తిగా అమల్లోకి రాకముందే "కాల్పుల విరమణ ముగిసింది" అనే ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచాన్ని మరోసారి యుద్ధ భయాల వైపు నెట్టాయి. హర్మూజ్ జలసంధి చుట్టూ పెరుగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై ఆందోళనలు, వరుస సైనిక చర్యలు కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కొత్త ముప్పును సృష్టిస్తున్నాయి. శాంతికి నాయకత్వం వహించాల్సిన అగ్రరాజ్యం ఇప్పుడు సంక్షోభాన్ని మరింత ముదిర్చే దిశగా అడుగులు వేస్తోందా అనే ప్రశ్న ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది.**




- ప్రపంచాన్ని నాశనం చేసే వరకు అంతేనా?
- రోజుకోలా అమెరికా అధ్యక్షుడి మాటలు
- అమెరికా-ఇరాన్ ఒప్పందం కూలిపోతుందా?
- హర్మూజ్ జలసంధి కొత్త సంక్షోభానికి కేంద్రం

అమెరికాఇరాన్ మధ్య జూన్ 17న కుదిరిన అవగాహన ఒప్పందం ఇప్పుడు తీవ్రమైన పరీక్షను ఎదుర్కొంటోంది. కాల్పుల విరమణ కొనసాగుతుందని భావించిన సమయంలో ఇరు దేశాలు మరోసారి పరస్పరం దాడులు చేసుకోవడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. ట్యాంకర్లపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేసింది. దీనికి ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఒక అమెరికన్ డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు ప్రకటించింది.

## ట్రంప్ వ్యాఖ్యలతో పెరిగిన ఉద్రిక్తత

నాటో సదస్సులో పాల్గొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితుల్లో ఈ వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగించాయి. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబాఫ్ అమెరికానే ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. బెదిరింపులకు తాము తలవంచబోమని స్పష్టం చేశారు. ఈ ఒప్పందం అమలులో మొదటి ప్రధాన సమస్య లెబనాన్ యుద్ధంగా మారింది. ఒప్పందం ప్రకారం లెబనాన్‌లో కాల్పుల విరమణ అమల్లో ఉండాలి. దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కూడా స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో సైనిక చర్యలను కొనసాగిస్తోంది. హిజ్బుల్లా కూడా ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించింది. దీంతో ఒప్పందంలోని తొలి నిబంధనే అమలుకాకపోవడంతో ఇరాన్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

## హర్మూజ్ జలసంధే రెండో వివాదం

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ఇప్పుడు రెండో ప్రధాన వివాదంగా మారింది. ఒప్పందం ప్రకారం వాణిజ్య నౌకలకు భద్రత కల్పిస్తామని ఇరాన్ హామీ ఇచ్చింది. భవిష్యత్తులో ఈ జలమార్గ నిర్వహణపై ఒమాన్‌తో పాటు గల్ఫ్ దేశాలతో చర్చలు జరపాలని కూడా నిర్ణయించారు. అయితే ఇరాన్ తన తీరానికి సమీపంలోని మార్గాన్నే ఉపయోగించాలని కోరుతుండగా, అమెరికా కొన్ని గల్ఫ్ దేశాలు ఒమాన్ వైపు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ భిన్న వైఖరే తాజా ఉద్రిక్తతలకు కారణమైంది. ఒప్పందం తర్వాత సడలించిన చమురు వాణిజ్య ఆంక్షలను అమెరికా మళ్లీ అమలు చేసింది. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా చర్యలకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. హోర్ముజ్ జలసంధిపై తమ నియంత్రణను వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తోంది.

## దౌత్య చర్చల భవిష్యత్తు ప్రశ్నార్థకం

ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాకు రెండు మార్గాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఒకటి సైనిక చర్యలను మరింత విస్తరించడం. రెండోది పరోక్ష చర్చలను కొనసాగిస్తూ ఒప్పందాన్ని కాపాడే ప్రయత్నం చేయడం. పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైతే ఇరాన్ అణు కార్యక్రమంపై జరుగుతున్న దౌత్య ప్రక్రియ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కొత్త పరిస్థితిని అంగీకరించకుండా చర్చలు ముందుకు సాగే అవకాశం కూడా తక్కువగా కనిపిస్తోంది. అందుకే అమెరికాఇరాన్ ఒప్పందం భవిష్యత్తు ఇప్పుడు అనేక అనుమానాల మధ్య నిలిచిపోయింది.

# రాశి ఫలితాలు

## 09.07.2026 గురువారం

**మేష రాశి :** ఆవేశము కంగారు తగ్గించుకొని హుందాగా వ్యవహరించండి. శరీరానికి వేడి చేసే ఆహారాన్ని తగ్గించి తీసుకోండి. పోటీ తత్వంతో చేసే పనులు అనుకూలం. క్రీడాకారులకు అనుకూలం. పాత రుణాన్ని తీరుస్తారు. గురు చరిత్ర పారాయణ మేలు చేస్తుంది.

**వృషభ రాశి :** ఉద్యోగస్తులు అధికారుల ఒత్తిడికి గురి అయ్యే ఆస్కారం ఉన్నది. నిద్ర తృప్తినివ్వక పోవచ్చు. జ్ఞాపక శక్తి పెంచుకోవాలి. అప్పు చేయవచ్చు. వ్యసనాల వల్ల ఆరోగ్యంతో పాటు పేరు కూడా కోల్పోతారు. సంతానం మాట వినాలంటే పెరుగుతో శివుడికి అభిషేకం చేయించండి.

**మిధున రాశి :** ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉన్న విద్యార్థులకు అనుకూలం. బంధుమిత్రులతో సంతోషంగా ఉంటారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటారు. క్రీడాకారులు జట్టును విజయతీరానికి చేరుస్తారు. జీవిత భాగస్వామి సహకారం లభిస్తుంది.

**కర్కాటక రాశి:** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ప్రజా జీవనం చేసే వారికి గుర్తింపు తథ్యం. ఉద్యోగస్తుల ప్రతిభను గుర్తిస్తారు. లౌక్యంగా మాట్లాడాలి. వైద్య, కొరియర్ రంగాల వారికి అనుకూలం. విలాసవంతమైన జీవనం చేస్తారు. ఉత్సాహవంతమైన ఆదాయమే.

**సింహరాశి:** ఇతరుల విషయాలు పట్టించుకోవద్దు. ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి. సామాన్య ఆదాయం. నిడారంబరంగా ఉండే ప్రయత్నం చేయండి. విద్యార్థులారా! మన ప్రవర్తనే మనకి మంచి పేరు తెస్తుంది కదా. ఆలయ సందర్శన చేస్తారు.

**కన్యారాశి :** ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. స్పెక్యులేషన్ బిజినెస్ జోలికి పోవద్దు సుమా! కుటుంబ సఖ్యత తగ్గింది. ఆర్థిక అసమానతలు. మీ పట్ల తక్కువగా మాట్లాడే వారి పట్ల జాగ్రత్తలు తీసుకోగలరు. సోదర సోదరీలతో సఖ్యతగా మెలగాలి ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోగలరు. గణపతి ఆలయ దర్శనం శుభప్రదం.

**తులారాశి :** భూసంపద కు ఆస్కారం. చిన్ననాటి మిత్రులను కలుస్తారు న్యాయవాదులకు సుదినం. అన్ని రంగాల వారికి సమాజంలో గౌరవం పెరుగును. ఆర్థికంగానూ లాభాన్నిస్తుంది. నిరుద్యోగులకు ఆశాజనకం.

**వృశ్చిక రాశి:** వృత్తి ఉద్యోగాలలో ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. నూతన వైద్య విధానం ప్రవేశపెట్టేందుకు అనుకూలం. విద్యార్థుల మనోభావాలకు తగినట్లుగా ఉండును. సన్నిహితుల ద్వారా నూతన విషయాలు తెలుసుకుంటారు.

**ధనస్సు రాశి :** నిద్ర లేవగానే తల్లి ఆశీస్సులు తీసుకోగలరు. భూ సంబంధ లావాదేవీలు వాయిదా వేసుకోగలరు. విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త తీసుకోగలరు. అతివిశ్వాసం తగ్గించి మీకు సంబంధించిన విషయాలపై శ్రద్ధ వహించండి. ప్రేమ వికటిస్తుంది. ఓర్పుగా బ్యాంకు పనులు పూర్తి చేసుకోగలరు. గోమాత పూజ శుభప్రదం.

**మకర రాశి:** జీవిత భాగస్వామితో సఖ్యత పెంచుకోవాలి. స్పెక్యులేషన్ చేయవద్దు తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టం కలుగును. రహస్య శత్రువులని గమనించవచ్చు. ఉద్యోగులపై ఏసీబీ దాడి చేసే ఆస్కారం ఉంది. విద్యార్థులు ఏకాగ్రతతో అభ్యసించాలి. గరికతో గణపతి పూజ మేలు చేస్తుంది.

**కుంభరాశి :** మిశ్రమ ఫలితాలు ఉండే అవకాశం ఉంది. మీ తెలివితేటలతో కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. కుటుంబ బాధ్యతలు పెరగడం వల్ల మానసిక ఒత్తిడి ఎదురుకావచ్చు. కెరీర్, ఆర్థిక, ఆరోగ్య వివరాలను ముందుగానే ప్లాన్ చేసుకోండి.

**మీన రాశి :** మీన రాశి : తొందర పడి మాట్లాడితే గొడవలు వస్తాయి. ఖర్చులు తగ్గించుకోగలరు. డ్రైవింగ్ నిదానంగా శ్రద్ధగా చేయాలి. నిలకడ లేని ఆర్థిక స్థితి. ఇరుగుపొరుగు వారితో సఖ్యతగా మెలగాలి. ఉలవల దానం మేలు చేస్తుంది.ఆస్కారం. విద్యార్థులకు అనుకూలం.కుటుంబ సౌఖ్యం. రావలసిన బాకీలు వస్తాయి.




టీటీడీ అనుబంధ సంస్థ
సమరసత సిద్ధాంతి
'దైవజ్ఞ' పులిపాక చంద్రశేఖర శర్మ
శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005


# చీరాలలో 'రాజన్న' 77వ జయంతి

- వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కరణం వెంకటేష్
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
- మహానేత ఆశయ సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతాం: వెంకటేష్ బాబు



**చీరాల, జూన్ 08 (నాదేశం):** చీరాల నియోజకవర్గంలో దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కరణం వెంకటేష్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. తొలుత పట్టణంలోని గడియార స్తంభాల సెంటర్ కు చేరుకుని, అక్కడ ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను, వారి సహాయకులను పరామర్శించి వారికి పండ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ.. వైఎస్సార్ నాడు ప్రవేశపెట్టిన చారిత్రాత్మక సంక్షేమ పథకాలు ప్రజా హృదయాల్లో ఆయనను అమరుడిగా నిలిపాయని అన్నారు. ఆ మహానేత ఆశయాల సాధనే ధ్యేయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాతం మేరి బాబు,బొనిగల జైసన్ బాబు,గవిని శ్రీనివాసరావు,గొశాల అశోక్,వాసిమళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

# చీరాలలో 'యాంటీడెంగ్యూ మాసోత్సవ' ర్యాలీ



**చీరాల, జూలై 8 (నాదేశం):** డెంగ్యూ నివారణ మరియు నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ధ్యేయంగా బాపట్ల జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చీరాల ఏరియా ఆసుపత్రిలో బుధవారం 'యాంటీడెంగ్యూ మాసోత్సవ' ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త డాక్టర్ పద్మావతు లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారులు మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, ఇతర అంటు వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల పెరుగుదలకు కారణమయ్యే నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లోని నీటి నిల్వ పాత్రలను, కుండలను, కూలర్లను శుభ్రం చేసుకునేలా "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యతగా క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లార్వా సర్వేలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని సమర్థవంతంగా నివారించవచ్చని అన్నారు. ఈ అవగాహన ర్యాలీలో ఈపురుపాలెం పి.హెచ్.సి డాక్టర్ శ్రీదేవి, చీరాల పి.హెచ్.సి డాక్టర్లు సాయి వైష్ణవి, జ్యోతిర్మయి, వేటపాలెం, పందిళ్ళపల్లి పీహెచ్సీల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమికం ఓకే..
# హైస్కూల్ నాట్ ఓకే

## ఉపాధ్యాయుల అర్హతలపై యూడైస్ నివేదిక

**ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, హైస్కూల్ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి ఆందోళన కలిగించేలా ఉందని యూడైస్+ 2025-26 నివేదిక వెల్లడించింది. విద్యా నాణ్యతను మెరుగుపర్చాలంటే ఉన్నత తరగతుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయుల సంఖ్య పెంచడం తెలంగాణకు కీలక సవాల్‌గా మారిందని నివేదిక స్పష్టం చేసింది.**

తెలంగాణ పాఠశాల విద్యా వ్యవస్థపై కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన యూడైస్ 202526 నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది. ప్రాథమిక పాఠశాలల్లో వృత్తిపరమైన అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల శాతం నిలకడగా ఉండటం రాష్ట్రానికి సానుకూల అంశంగా కనిపించింది. అయితే విద్యార్థులు ఉన్నత తరగతుల్లోకి వెళ్లే కొద్దీ పరిస్థితి పూర్తిగా మారిపోతోందని నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా హైస్కూల్ స్థాయిలో వృత్తిపరమైన అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని వెల్లడించింది. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఈ విషయంలో వెనుకబడినట్లు నివేదిక పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

### ప్రాథమిక విద్యలో నిలకడ

ప్రాథమిక విద్యా దశలో అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత సంతృప్తికరంగా ఉందని యూడైస్ నివేదిక తెలిపింది. చిన్నారులకు నాణ్యమైన బోధన అందించడానికి అవసరమైన మానవ వనరులు ఈ స్థాయిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. విద్యార్థుల పునాది బలంగా ఉండాలంటే ఈ దశలో సమర్థులైన ఉపాధ్యాయులు కీలకమని నివేదిక గుర్తుచేసింది. ఈ విషయంలో తెలంగాణ ఇప్పటివరకు తన స్థాయిని కొనసాగించడం విశేషంగా పేర్కొంది.

### హైస్కూల్ స్థాయిలో తగ్గుతున్న అర్హతలు

ప్రాథమిక దశ తర్వాత పరిస్థితి మారుతోందని నివేదిక వెల్లడించింది. హైస్కూల్ స్థాయిలో వృత్తిపరమైన అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల శాతం గణనీయంగా తగ్గుతోందని పేర్కొంది. దీని ప్రభావం విద్యార్థుల అభ్యాస నాణ్యతపై పడే అవకాశం ఉందని విద్యావేత్తలు భావిస్తున్నారు. జాతీయ విద్యా విధానం లక్ష్యాలను సాధించాలంటే ఉన్నత తరగతుల్లో కూడా సమాన స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.



# పేదలకు వరంగా 'గోరంట్ల సూపర్ స్పెషాలిటీ'

- ఎమ్మెల్యేలు మాలకొండయ్య, నరేంద్ర వర్మ చేతుల మీదుగా 'ఎన్టీఆర్ వైద్య సేవలు' షురూ
- జిల్లాలోనే మొట్టమొదటి 100 పడకల అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

**చీరాల, జూలై 8 (నాదేశం) :** బాపట్ల జిల్లా వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా 100 పడకల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న చీరాలలోని 'శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్'లో ఎన్టీఆర్ వైద్య సేవలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హాస్పిటల్ అధినేతలు డాక్టర్ గోరంట్ల రాజేష్, డాక్టర్ శ్రావణి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఈ ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు.

గతంలో గుండెపోటు, పక్షవాతం వంటి అత్యవసర వైద్యసేవల కోసం ఈ ప్రాంత ప్రజలు గుంటూరు, విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, సరైన సమయంలో వైద్యం అందక కొందరు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయారని డాక్టర్ రాజేష్ అన్నారు. ఇకపై అలాంటి ఇబ్బందులు లేకుండా అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ సదుపాయంతో గుండె జబ్బులకు స్టెంట్లు వేయడం, డయాలసిస్, పక్షవాతం, ఈఎన్‌టీ, యూరాలజీ, జనరల్ సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ఉచితంగా అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. గడిచిన ఏడాదిన్నర కాలంలోనే తమ హాస్పిటల్‌లో 300కు పైగా యాంజియోగ్రామ్‌లు, 100కు పైగా స్టెంట్లను విజయవంతంగా వేశామని, 24 గంటల పాటు నిపుణులైన అత్యవసర వైద్య బృందం అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యలున్నా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే గొప్ప సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ వైద్యసేవ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వేలకోట్లు కేటాయిస్తున్నారని అన్నారు. కేవలం చీరాల నియోజకవర్గంలోనే ఇప్పటివరకు 990 మందికి రూ.10 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్య ఖర్చులకు సహాయం అందించినట్లు వెల్లడించారు. ఆసుపత్రి యాజమాన్యాలు కూడా మానవతా దృక్పథంతో ప్రభుత్వ ఆశయాన్ని గౌరవించి, ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. దేశంలో ఏ నాయకుడు చేయనంతగా, పేదప్రజల ఆరోగ్యం కోసంసీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
గురువారం 09 జులై 2026
www.prabhathakiranam.com

## కూకట్‌పల్లి అభివృద్ధికి రూ.13 కోట్లు ఇవ్వండి

### నిధులు కోరిన ఎమ్మెల్యే మాధవరం



కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. బుధవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఆయన, ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట, ఫతేనగర్, ప్రకాశ్‌నగర్ డివిజన్లలో స్థానిక అసోసియేషన్లు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు ఆలస్యమవడం వల్ల ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాగునీరు, రహదారులు, విద్యుత్, పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా పనులు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులు కూడా నిధుల కొరతతో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.13 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలి

**• కార్పొరేటర్లకు ఎమ్మెల్యే మాధవరం సూచనలు**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్లకు సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి టెలిఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. బీఎల్ఏలు, బీఎల్‌వోలతో ఎప్పటికప్పుడు సమన్వయం కొనసాగించాలని, ఓటర్లకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఇంటింటికీ వచ్చిన సమయంలో ప్రజలకు అవసరమైన సమాచారం అందించి, దరఖాస్తులు సక్రమంగా నింపేలా సహకరించాలని కోరారు. ఎవరైనా ఓటర్లు అందుబాటులో లేకపోతే వారి వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు అందించాలని చెప్పారు. ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కని, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా పరిరక్షించేందుకు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ ఓటర్ల హక్కులను కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## లోగో డిజైన్ చేయండి రూ.లక్ష గెలుచుకోండి

**హౌసింగ్ బోర్డు బంపరాఫర్ • జూలై 12 వరకు అవకాశం**

తెలంగాణ హౌసింగ్ బోర్డు సృజనాత్మక ప్రతిభకు బంపర్ అవకాశం కల్పించింది. క్యూర్ పరిధిలో చేపట్టనున్న లక్ష ఇళ్ల గృహ నిర్మాణ పథకానికి లోగో డిజైన్ పోటీని ప్రకటించింది. ఉత్తమ లోగో రూపొందించిన విజేతకు రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూలై 12లోపు హౌసింగ్ బోర్డు అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఉన్న గూగుల్ ఫారమ్ ద్వారా తమ లోగోను అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేయాలి. ఇటీవల పథకానికి పేరు సూచించే పోటీకి 14 వేలకుపైగా ఎంట్రీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపికైన లోగోను అధికారిక ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ వేదికలు, సమాచార మార్పిడిలో వినియోగించనున్నారు. డిజైనర్లు, విద్యార్థులు, కళాకారులు సహా ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని హౌసింగ్ బోర్డు తెలిపింది.




# స్పామ్ కాల్స్‌పై పోరు

## ట్రూకాలర్‌కు ట్రాయ్ చెక్

»స్పామ్ హెచ్చరికలపై కొత్త వివాదం

»ట్రాయ్ నిర్ణయంపై ట్రూకాలర్ అభ్యంతరం

మొబైల్ మోగితే ముందు స్క్రీన్ వైపు చూసేది ఎందుకు? కాల్ చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకోవడానికే కాదు... అది స్పామ్ కాల్ కాదా, మోసగాడి నంబర్ కాదా అని నిర్ధారించుకోవడానికే. అలాంటి సమయంలో కోట్లాది మంది నమ్మకంగా ఉపయోగిస్తున్న ట్రూకాలర్ ఇప్పుడు ప్రభుత్వ నియంత్రణ చర్చలో చిక్కుకుంది. ఒకవైపు స్పామ్ కాల్స్‌ను అడ్డుకోవాలనే లక్ష్యం... మరోవైపు అధికారిక నంబర్లకు స్పామ్ హెచ్చరికలు చూపొద్దన్న ట్రాయ్ ఆదేశాలు కొత్త వివాదానికి తెరలేపాయి. ప్రజలకు నిజమైన సమాచారం అందించాలా? లేక అధికారిక నంబర్లకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలా? అన్న ప్రశ్న ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వినియోగదారుల భద్రత, డిజిటల్ స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ మధ్య సమతుల్యత ఎలా ఉండాలన్న అంశం కేంద్రంగా ట్రూకాలర్‌ట్రాయ్ మధ్య పోరు ముదురుతోంది. ఈ వివాదం కేవలం ఒక యాప్‌కే పరిమితం కాదు... భవిష్యత్తులో డిజిటల్ సేవలపై ప్రభుత్వ నియంత్రణ ఎంతవరకు ఉండాలనే పెద్ద చర్చకు ఇది నాంది పలుకుతోంది.




## యూఎస్- ఇరాన్ ఉద్రిక్తతలు

»కుప్పకూలిన స్టాక్ మార్కెట్

»₹ 8 లక్షల కోట్ల సంపద ఆవిరి

»పెట్టుబడిదారులకు భారీ షాక్




## ఎంత పని చేశావ్ ట్రంప్

**ప్రపంచాన్ని నాశనం చేసే వరకు అంతేనా?**

**రోజుకోలా మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు**

**అమెరికా-ఇరాన్ ఒప్పందం కూలిపోతుందా?**

**హర్మూజ్ జలసంధి కొత్త సంక్షోభానికి కేంద్రం**




### తాడిచెర్ల-2పై రచ్చ

## సింగరేణి బొగ్గు బ్లాక్ వివాదం

**కేటాయింపులపై రాజకీయ రగడ • 2013లోనే అధికారిక కేటాయింపు**

**కిషన్ రెడ్డి ప్రకటనలపై భట్టి ఆగ్రహం**

### తెలంగాణలో పెట్టుబడులపై

# కెనడా ఆసక్తి

**సీఎం రేవంత్‌తో హైకమిషనర్ కీలక చర్చలు**



తెలంగాణలో పెట్టుబడుల విస్తరణపై కెనడా ఆసక్తి వ్యక్తం చేసింది. కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లో భేటీ అయింది. ఈ సందర్భంగా పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, పారిశ్రామిక రంగాలపై విస్తృతంగా చర్చించారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావడానికి కెనడా సంస్థలు ఆసక్తి చూపించాయి. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్‌లో కెనడా విశ్వవిద్యాలయాల మల్టీ క్యాంపస్‌ల ఏర్పాటు ప్రతిపాదన కూడా ముందుకు వచ్చింది. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతిని సీఎం వివరించారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలను ఆహ్వానించారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ ముందంజలో ఉందని కెనడా హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాలకు చెందిన కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం త్వరలో తెలంగాణలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.



## ఆయిల్ పామ్‌కు ఊతం..

### 700 మందికి ఉపాధి

**ఖమ్మంలో రూ.300 కోట్లతో భారీ ప్రాజెక్ట్**

**గోద్రెజ్ కంపెనీతో సీఎం రేవంత్ కీలక చర్చలు**

తెలంగాణలో తొలి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ భేటీలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, పరిశ్రమ అభివృద్ధి, రైతులకు కలిగే ప్రయోజనాలపై చర్చించారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో ప్రాసెసింగ్ మిల్, నర్సరీ, పరిశోధన కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 113.5 ఎకరాల భూమిని కేటాయించింది. అదనంగా సీడ్ గార్డెన్ కోసం మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని ఇవ్వాలని సంస్థ కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. ప్రాసెసింగ్ మిల్‌కు అనుసంధానంగా రహదారి విస్తరణ అవసరమని సంస్థ ప్రతినిధులు కోరగా, టీజీఐఐసీ ఆధ్వర్యంలో వెంటనే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి కొత్త ఊతం ఇవ్వనుందని ప్రభుత్వం భావిస్తోంది.



## ఒక్కో నాణెం... ఒక్కో కథ!

» లక్షా 10 వేల బైక్ ₹10 కాయిన్స్‌తో కొనేశాడు

» షోరూంలో గంటల తరబడి లెక్కలు!

» డిజిటల్ ప్రపంచానికి షాక్ ఇచ్చిన కొనుగోలు!

యూపీఐ స్కాన్ కోసం ఎదురు చూసిన షోరూం ఒక్కసారిగా నిశ్శబ్దమైంది... చేతిలో మొబైల్ లేదు, కార్డు లేదు, చెక్ లేదు. బదులుగా వరుసగా వచ్చిన సంచులు... వాటి నిండా మెరిసిన రూ.10 నాణేలు! ఒక్కో నాణెం లెక్కపడుతుంటే గంటలు గడిచాయి... కానీ చివరికి అదే నాణేలు కొత్త బైక్‌కు తాళాలు తెచ్చిపెట్టాయి. డిజిటల్ యుగంలో "నాణెం కూడా చట్టబద్ధమైన కరెన్సీయే" అని తెలంగాణలో ఓ వ్యక్తి చేసిన ఈ వినూత్న కొనుగోలు ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

(వివరాలు 5లో..)

## రూ.8 లక్షల అప్పు.. రూ.83 లక్షల భారం

### భర్త మృతికి న్యాయం చేయాలంటున్న భార్య

కేవలం రూ.8 లక్షల అప్పు... చివరకు ఓ కుటుంబాన్ని శాశ్వత చీకటిలోకి నెట్టేసింది. భర్తను కోల్పోయిన భార్య కన్నీటి కళ్లతో న్యాయం కోసం వేడుకుంటుండగా, తండ్రిని కోల్పోయిన చిన్నారి జీవితమంతా ప్రశ్నార్థకంగా మారింది. "అప్పు తీర్చాం... భూమి కూడా ఇచ్చాం... అయినా వేధింపులు ఆగలేదు" అంటూ భార్య చెబుతున్న మాటలు హృదయాలను కదిలిస్తున్నాయి. సూసైడ్ నోట్‌లో పేర్లు రాసి ప్రాణాలు తీసుకున్నాడని కుటుంబం ఆరోపిస్తుండగా, ఆ కన్నీటి వెనుక అసలు నిజం ఏమిటన్నది ఇప్పుడు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. (వివరాలు 5లో..)





## చంద్రబాబు కోసమే

## గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

**చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు**

**దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా?**

**తుమ్మడిహట్టి వద్ద అనుమతులుంటే ఎందుకు కట్టలేదు?**

**రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్**

గోదావరి జలాల వినియోగం అంశంపై తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గోదావరిలో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు ఉపయోగపడేలా ఎత్తిపోసే చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారం సాధారణ నిర్లక్ష్యం కాదని, "క్రిమినల్ నెగ్లిజెన్స్" అని అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. (వివరాలు 5లో..)

## కాళేశ్వరంపై కట్టుకథలు చాలు



◆ గోదావరి నీళ్లు ఎత్తిపోసి రైతులను ఆదుకోండి

◆ రేవంత్ సర్కారును డిమాండ్ చేసిన కేటీఆర్

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా మారుతున్న వేళ గోదావరి జలాల వినియోగంపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకవైపు రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా దిగువకు వెళ్లిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేయడం మానేసి, రైతులకు అవసరమైన నీటిని అందించడంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. (వివరాలు 5లో..)

### ప్రపంచ బ్యాంక్ నివేదికపై కేటీఆర్ హర్షం

తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటి సంపన్న రాష్ట్రంగా నిలిచిందంటూ ప్రపంచ బ్యాంక్ వెల్లడించిన నివేదికపై బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఈ హోదా సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం గర్వకారణమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాదని, సఫలమైన సంపన్న రాష్ట్రంగా ఎదిగిందని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని, ప్రజల ఆదాయం పెరిగిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ వస్తే ఏమొచ్చిందని ప్రశ్నించిన వారికి ప్రపంచ బ్యాంక్ నివేదికే సమాధానమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగా చిత్రీకరించే ప్రచారాలకు ఈ నివేదిక చెక్ పెట్టిందని కేటీఆర్ తన పోస్టులో తెలిపారు.




## మొన్న నీట్..నేడు నెట్

◆ పరీక్షలపై కొత్త వివాదం

◆ యూజీసీ-నెట్ అవకతవకలు

◆ విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన

◆ కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

## కదిలించిన విషాదం..

» పవన్ అభిమాని నిరంజన్ కన్నుమూత

» సోషల్ మీడియాలో నివాళుల వెల్లువ



అరుదైన జన్యు వ్యాధితో పోరాడుతూ వేలాది మందిని తన ధైర్యంతో ఆకట్టుకున్న పవర్ స్టార్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమాని నిరంజన్ కన్నుమూశాడు. ఇటీవల హనుమకొండలోని అతని ఇంటికి వెళ్లి పవన్ కళ్యాణ్ స్వయంగా పరామర్శించారు. నిరంజన్‌ను ఆప్యాయంగా కౌగిలించుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడటంతో పాటు ఆర్థిక సాయం అందించారు. జీవనోపాధికి కూడా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. తిరుమల ప్రసాదం అందిస్తూ అతను త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. అయితే చికిత్స పొందుతున్న నిరంజన్ చివరకు మృతి చెందడంతో అభిమానులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియాలో వేలాది మంది సంతాప సందేశాలు పోస్టు చేస్తున్నారు. "నిరంజన్ చిరునవ్వు ఎప్పటికీ గుర్తుంటుంది", "చిన్న వయసులోనే గొప్ప పోరాటం చేశావు" అంటూ నివాళులు అర్పిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమాన వర్గాల్లో ఈ వార్త తీవ్ర విషాదాన్ని నింపింది. అభిమానులు నిరంజన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.

## కొండంత వివాదం

**"నా హద్దులు నాకు తెలుసు" • సురేఖపై శ్రీహరి ఫైర్**

**మంత్రి ఫిర్యాదుతో మొదలైన వివాదం**



మంత్రి కొండా సురేఖ ఫిర్యాదుతో కాంగ్రెస్‌లో మొదలైన వివాదం ఇప్పుడు రాజకీయంగా వేడెక్కింది. దేవాదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారన్న ఆరోపణలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి తొలిసారి స్పందిస్తూ తాను ఎలాంటి తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. అధికారిక సమీక్ష నిర్వహించలేదని, నియోజకవర్గంలోని ఆలయాల సమస్యలు, అభివృద్ధి పనులపై మాత్రమే అధికారులతో చర్చించానని చెప్పారు. ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలవడం తన బాధ్యతేనని, ప్రోటోకాల్ పరిమితులు తనకు పూర్తిగా తెలుసని పేర్కొన్నారు. ఈ వివాదం అవగాహన లోపం వల్లే వచ్చిందని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి అనవసర రాజకీయ రచ్చ సృష్టించడం సరికాదని వ్యాఖ్యానించారు. అధిష్ఠానం ఈ వ్యవహారంపై ఎలా స్పందిస్తుందన్న ఆసక్తి నెలకొంది.

(వివరాలు 5లో..)



# తాడిచెర్ల-2పై రచ్చ

- సింగరేణి బొగ్గు బ్లాక్ వివాదం
- కేటాయింపులపై రాజకీయ రగడ
- 2013లోనే అధికారిక కేటాయింపు
- కిషన్ రెడ్డి ప్రకటనలపై భట్టి ఆగ్రహం

సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా తప్పుబట్టారు. ఈ బొగ్గు బ్లాక్‌ను కేంద్రం ఇప్పుడు కొత్తగా కేటాయించినట్లు ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. అసలు చరిత్రను పక్కనపెట్టి రాజకీయ ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను 2013 సెప్టెంబర్ 16న అప్పటి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా సింగరేణి కాలరీస్‌కు కేటాయించిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అప్పటికే కేటాయించిన బ్లాక్‌ను ఇప్పుడు కొత్తగా ఇచ్చినట్లు చెప్పుకోవడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న బొగ్గు గనులను చట్టం ప్రకారం ప్రభుత్వ సంస్థలకే కేటాయించాల్సి ఉంటుందని, అందువల్ల ఇది కొత్త నిర్ణయం కాదని వివరించారు.

**రాష్ట్ర ప్రభుత్వ పోరాటమే కారణం**

సింగరేణి సంస్థ 2021లోనే మైనింగ్ లీజు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనుమతులను సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉంచిందని భట్టి ఆరోపించారు. ఈ ఆలస్యం వల్ల సింగరేణికి వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థకు రావాల్సిన అనుమతులను ఆలస్యం చేయడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. తాడిచెర్ల2 మైనింగ్ లీజు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తెచ్చిందని భట్టి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసి ఈ అంశంపై పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. గత ఏడాది అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి సమస్యను వివరించామని, అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా ప్రత్యేకంగా వినతిపత్రం అందజేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగానే ప్రక్రియ ముందుకు సాగిందని పేర్కొన్నారు.

**ప్రైవేట్ సంస్థలకు గనుల కేటాయింపుపై ప్రశ్నలు**

కోయగూడెం బ్లాక్3, సత్తుపల్లి బ్లాక్3 గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని భట్టి ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న బొగ్గు గనులను ప్రభుత్వ సంస్థలే నిర్వహించాలనే నిబంధనను కేంద్రం విస్మరించిందని విమర్శించారు. ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన గనుల్లో ఇప్పటికీ తవ్వకాలు ప్రారంభం కాలేదని అన్నారు. దీనివల్ల జాతీయ సంపద వినియోగం ఆలస్యమైందని పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీస్‌కే కేటాయించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. నిజంగా సింగరేణి అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైతే కోయగూడెం బ్లాక్3, సత్తుపల్లి బ్లాక్3 గనులను కూడా వెంటనే సింగరేణికి అప్పగించాలని కోరారు. గతంలో జరిగిన నిర్ణయాలపై రాజకీయ ప్రచారం చేయడం కంటే తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారంతో సింగరేణి బొగ్గు గనుల కేటాయింపుపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరోసారి రాజకీయ వాగ్వాదం చెలరేగింది.


# రూ.8 లక్షల అప్పు.. రూ.83 లక్షల భారం

**భర్త మృతికి న్యాయం చేయాలంటున్న భార్య**

వికారాబాద్ జిల్లాలో అప్పు వ్యవహారం విషాదానికి దారితీసిందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తన భర్త మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దొంగ మన్నెకేపల్లి గ్రామానికి చెందిన శేరి అశ్విని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరుతున్నారు. అప్పు పేరుతో నిరంతరం మానసికంగా వేధింపులకు గురిచేయడంతోనే తన భర్త శేరి రాంరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు భర్త రాసిన సూసైడ్ నోట్‌ను ప్రస్తావిస్తూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రూ.8 లక్షల అప్పు.. భారీ మొత్తంగా మారిందన్న ఆరోపణ**

శేరి రాంరెడ్డి కొందరి వద్ద రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నారని, ఆ మొత్తంపై అధిక వడ్డీ వసూలు చేస్తూ చివరకు అప్పును రూ.83 లక్షలకు చేర్చారని అశ్విని ఆరోపించారు. నెలకు రూ.40 వేల చొప్పున వడ్డీ వసూలు చేశారని పేర్కొన్నారు. అప్పు తీర్చేందుకు తమకు చెందిన సుమారు రెండు ఎకరాల 14 గుంటల వ్యవసాయ భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. అయినప్పటికీ అదనంగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. గత నెల జూన్ 20న శేరి రాంరెడ్డి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మరణానికి ముందు రాసిన లేఖలో పూడూరు మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ, వారి వేధింపుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నానని పేర్కొన్నట్లు అశ్విని వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన ఇంకా వెలువడలేదు.



**ఫిర్యాదు చేసినా స్పందన లేదన్న ఆరోపణ**

భర్త మరణించిన రోజే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని అశ్విని ఆరోపించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి, సూసైడ్ నోట్‌లో పేర్లు ఉన్న వారిపై చట్టప్రకారం విచారణ చేపట్టాలని కోరారు. ఆలస్యం వల్ల తమ కుటుంబానికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో తాను, తన కుమారుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అశ్విని తెలిపారు. ఆర్థికంగా, మానసికంగా తీవ్ర కష్టాల్లో ఉన్నామని చెప్పారు. తన భర్త మరణానికి కారణమైన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నప్పటికీ, వాటి నిజానిజాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. సూసైడ్ నోట్, అప్పు లావాదేవీలు, భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బాధిత కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తుండగా, ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ఇసుక లారీ బీభత్సం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామచంద్రపురం రహదారిపై ఇసుక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. వేగంగా దూసుకొచ్చిన లారీ రైతు నల్లూరి వెంకన్నబాబుపైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఆయన సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు రామచంద్రపురం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టడంతో ఇసుక లారీల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిరసనకు మద్దతు తెలిపారు. అతివేగంగా వెళుతున్న ఇసుక లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రహదారులపై పటిష్ట పర్యవేక్షణ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# కొండంత వివాదం



- "నా హద్దులు నాకు తెలుసు"
- సురేఖపై శ్రీహరి ఫైర్
- మంత్రి ఫిర్యాదుతో మొదలైన వివాదం

కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం మరింత ముదిరింది. దేవాదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారంటూ మంత్రి కొండా సురేఖ ఏఐసీసీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కడియం శ్రీహరి తొలిసారి బహిరంగంగా స్పందించారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, అందుకే ఎవరికీ వివరణ ఇచ్చే అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రోటోకాల్‌కు లోబడే వ్యవహరిస్తానని, తన అధికారాల పరిధి ఏమిటో తనకు పూర్తిగా తెలుసని అన్నారు.

**• సమీక్ష కాదు.. సమస్యలపై చర్చ మాత్రమే**

దేవాదాయ శాఖ అధికారులతో తాను అధికారిక సమీక్ష నిర్వహించలేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడినట్లు చెప్పారు. దేవాదాయ శాఖ వద్ద నిధులు లేకపోతే అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేయాలని మాత్రమే సూచించానని వివరించారు. శాఖ పనితీరును సమీక్షించే అధికారం తనకు లేదనే విషయం తనకు తెలుసని పేర్కొన్నారు.

**• ప్రజా సమస్యలే తన ప్రాధాన్యం**

వరంగల్ తూర్పు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని కడియం శ్రీహరి సూచించారు. ఎంజీఎం ఆసుపత్రిలో శాశ్వత సూపరింటెండెంట్ లేకపోవడం, నగరంలో డ్రైనేజీ సమస్యలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి అనవసర వివాదాలను సృష్టించడం వల్ల ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు.

**• ఎమ్మెల్యే అధికారాలపై స్పష్టత**

ఎన్నికైన ప్రజాప్రతినిధిగా అధికారులను కలవడం తన బాధ్యతలో భాగమేనని కడియం శ్రీహరి అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఒక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడకూడదని చెప్పే మంత్రిని తాను ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. శాఖ సమీక్ష నిర్వహించడం, నియోజకవర్గ సమస్యలపై అధికారులతో చర్చించడం రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేశారు.

**• అవగాహన లోపమే కారణమన్న కడియం**

ఈ వివాదం పూర్తిగా అవగాహన లోపం వల్లే ఏర్పడిందని కడియం శ్రీహరి అన్నారు. కొందరు కావాలనే వివాదాలు సృష్టించి ప్రజల్లో చర్చనీయాంశంగా మారాలని చూస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సంబంధిత మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని చెప్పారు. ఆలయాల అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలవడం తప్ప మరే ఉద్దేశం లేదని వివరించారు.

**• రాజకీయంగా వేడెక్కిన వ్యవహారం**

మంత్రి కొండా సురేఖ చేసిన ఫిర్యాదు తర్వాత ఈ వ్యవహారం కాంగ్రెస్‌లో రాజకీయ చర్చగా మారింది. ప్రజాప్రతినిధుల అధికారాల పరిధి, శాఖల నిర్వహణ, ప్రోటోకాల్ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదం ఎలా ముగుస్తుందన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. అధిష్ఠానం ఈ అంశంపై ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. ప్రస్తుతం కడియం శ్రీహరి తనపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా?
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులుంటే ఎందుకు కట్టలేదు?
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

**చంద్రబాబు కోసమే నీళ్లు వదులుతున్నారన్న ఆరోపణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడికి గురుదక్షిణ చెల్లించేందుకే గోదావరి నీటిని దిగువకు వదులుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ధర్మసాగర్, రామప్ప వంటి కీలక చెరువులు ఖాళీగా ఉన్నా వాటిని నింపే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం కింద ఉన్న ప్రాజెక్టులకు నీరు అందించి రైతులకు సాగునీరు ఇవ్వాల్సిన సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద లక్షకు పైగా క్యూసెక్కుల వరద ప్రవాహం ఉన్నా దేవాదుల ప్రాజెక్టు మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. అవసరమైన నీటి మట్టం ఉన్నప్పటికీ కావాలనే నీటిని ఎత్తిపోసే ప్రక్రియ నిలిపివేశారని విమర్శించారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80 శాతం చెరువులు ఎండిపోయాయని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడాల్సిన నీరు వృథాగా దిగువకు వెళ్లిపోతోందని అన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదికలు బయట పెట్టాలి**

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంపై ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలను కూడా హరీశ్ రావు ఖండించారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి అనుకూల పరిస్థితులే ఉన్నాయని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ నివేదిక స్పష్టం చేసిందని చెప్పారు. అయితే అక్కడి నుంచి నేరుగా మిడ్ మానేరు వరకు నీటిని తరలించే ప్రతిపాదన సాధ్యం కాదని కమిటీ సూచించడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుందని వివరించారు. ఇదే విషయాన్ని పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా కమిటీ నివేదించిందని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ వద్ద రబ్బర్ డ్యామ్ ఏర్పాటు చేసి మోటార్లను ప్రారంభించవచ్చని ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆ నివేదిక ఇచ్చిన కొద్ది రోజులకే సంబంధిత అధికారిని బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా పదవీ విరమణ చేయించారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద నిజాయితీ ఉంటే ఆ నివేదికను ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు.

**తుమ్మిడిహట్టిపై సవాల్**

తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర అనుమతులు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పడం వాస్తవం కాదని హరీశ్ రావు విమర్శించారు. నిజంగా అనుమతులు ఉంటే సంబంధిత ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం బయటపెడితే తాను రాజకీయ బాధ్యత వహించడానికి సిద్ధమని, లేకపోతే ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని కూడా ఆరోపించారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. గోదావరి జలాలను చెరువులు, రిజర్వాయర్లకు మళ్లించి రైతులకు సాగునీరు అందించాల్సిన సమయంలో ప్రభుత్వం ఆ అవకాశాన్ని వదులుకుందని అన్నారు. ఈ విమర్శలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకం అంశాలు మరోసారి తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి.





# కాళేశ్వరంపై కట్టుకథలు చాలు

- గోదావరి నీళ్లు ఎత్తిపోసి రైతులను ఆదుకోండి
- రేవంత్ సర్కారును డిమాండ్ చేసిన కేటీఆర్

**• రైతు ముఖ్యమా.. రాజకీయమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రైతులను శిక్షించడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంతో ఉన్న విభేదాలను రైతులపై చూపకూడదని సూచించారు. అన్నం పెట్టే రైతును రాజకీయాల కోసం ఇబ్బందులకు గురి చేయడం తగదని అన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవక నాట్లు ఆలస్యమవుతున్నాయని, విత్తనాలు వేయలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇలాంటి సమయంలో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కరువు ముప్పు దగ్గరపడుతున్నా అవసరమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**• గోదావరి నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉందన్న వాదన**

కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో సమృద్ధిగా నీరు ప్రవహిస్తున్నప్పటికీ దానిని వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. మేడిగడ్డ వద్ద ప్రవహిస్తున్న నీటిని ఎత్తిపోసి చెరువులు, రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ఉపయోగపడేదని అన్నారు. నీరు అందుబాటులో ఉన్న సమయంలోనే దానిని వినియోగించకపోవడం వల్ల భవిష్యత్తులో మరింత ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఎందుకు ప్రారంభించడం లేదని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోటార్లను నడిపి గోదావరి నీటిని ఎత్తిపోస్తే సాగునీటి సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనే రైతులకు అండగా నిలుస్తుందని గుర్తుచేశారు.

# ఒక్కో నాణెం.. ఒక్కో కథ!

- లక్షా 10 వేల బైక్ ₹10 కాయిన్స్‌తో కొనేశాడు
- షోరూంలో గంటల తరబడి లెక్కలు!
- డిజిటల్ ప్రపంచానికి షాక్ ఇచ్చిన కొనుగోలు!



యూపీఐ స్కాన్ కోసం ఎదురు చూసిన షోరూం ఒక్కసారిగా నిశ్శబ్దమైంది... చేతిలో మొబైల్ లేదు, కార్డు లేదు, చెక్ లేదు. బదులుగా వరుసగా వచ్చిన సంచులు... వాటి నిండా మెరిసిన రూ.10 నాణేలు! ఒక్కో నాణెం లెక్కపడుతుంటే గంటలు గడిచాయి... కానీ చివరికి అదే నాణేలు కొత్త బైక్‌కు తాళాలు తెచ్చిపెట్టాయి. డిజిటల్ యుగంలో "నాణెం కూడా చట్టబద్ధమైన కరెన్సీయే" అని తెలంగాణలో ఓ వ్యక్తి చేసిన ఈ వినూత్న కొనుగోలు ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

యూపీఐ, కార్డులు, ఆన్‌లైన్ చెల్లింపులు నిత్యజీవితంలో భాగమైన ఈ రోజుల్లో తెలంగాణలో ఓ వ్యక్తి చేసిన కొనుగోలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జేబులో ఫోన్ లేదు... చేతిలో చెక్ లేదు... బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ కూడా కాదు. ఏకంగా సంచుల నిండా రూ.10 నాణేలు తీసుకెళ్లి లక్షకు పైగా విలువైన కొత్త మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. షోరూంలో నాణేల సంచులు తెరిచి ఒక్కోటి లెక్కపెట్టిన దృశ్యం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. "నాణేలు కూడా చట్టబద్ధమైన కరెన్సీయే" అని మరోసారి గుర్తు చేసిన సంఘటనగా ఇది నిలిచింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండె రఘుపతి, చిట్యాలలోని శ్రీ వినాయక మోటార్స్‌లో స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్ కొనుగోలు చేశారు. బైక్ ధర రూ.1.10 లక్షలు. అయితే ఆ మొత్తాన్ని నగదు నోట్లు, డిజిటల్ చెల్లింపుల ద్వారా కాకుండా పూర్తిగా రూ.10 నాణేల రూపంలో చెల్లించారు. నాణేలతో నిండిన సంచులు షోరూంకు చేరడంతో అక్కడికి వచ్చిన వారంతా ఆసక్తిగా వీక్షించారు.

**ఓర్పుతో నాణేలు లెక్కించిన సిబ్బంది**


షోరూం సిబ్బంది ఎలాంటి అసహనం చూపకుండా ప్రతి నాణాన్ని ఓర్పుగా లెక్కించారు. మొత్తం సొమ్ము సరిపోతుందని నిర్ధారించుకున్న తర్వాత రఘుపతికి కొత్త బైక్‌ను అందజేశారు. నాణేల రూపంలో చెల్లింపు జరిగినప్పటికీ కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. వ్యాపార సంస్థ సిబ్బంది సహనాన్ని పలువురు అభినందించారు. ఈ వినూత్న కొనుగోలు ఇప్పుడు నల్గొండ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. నాణేలతో లక్ష రూపాయలకు పైగా చెల్లించడం చాలా అరుదుగా జరిగే విషయం కావడంతో ఈ ఘటన గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. షోరూంలో నాణేలు లెక్కిస్తున్న దృశ్యాలను చూసిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో కూడా ఈ ఘటనపై చర్చ కొనసాగుతోంది.

**తెలంగాణలో ఇదే తొలిసారి కాదు**

నాణేలతో బైక్ కొనుగోలు చేయడం తెలంగాణలో ఇదే మొదటిసారి కాదు. 2022లో మంచిర్యాల జిల్లాకు చెందిన యూట్యూబర్ ఎరవేని వెంకటేశ్ రూ.2.85 లక్షల విలువైన కేటీఎం బైక్‌ను పూర్తిగా రూ.1 నాణేలతో కొనుగోలు చేశారు. అప్పట్లో షోరూం సిబ్బంది నాణేలు లెక్కించడానికి ఒక రోజుకు పైగా సమయం పట్టింది. ఇప్పుడు నల్గొండలో జరిగిన ఘటనతో మరోసారి నాణేల చెల్లింపులపై ఆసక్తికర చర్చ మొదలైంది. భారతీయ కరెన్సీలో నాణేలు కూడా నోట్లతో సమానంగా చట్టబద్ధమైన చెల్లింపు సాధనమే. పెద్ద మొత్తంలో నాణేలు తీసుకురావడం వల్ల లెక్కించడానికి సమయం ఎక్కువ పట్టినా, వాటిని తిరస్కరించలేమని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది. డిజిటల్ చెల్లింపుల హవా మధ్య నాణేలతో జరిగిన ఈ బైక్ కొనుగోలు సాధారణ లావాదేవీని ఒక ఆసక్తికర సంఘటనగా మార్చేసింది.

# మొన్న నీట్..నేడు నెట్

- » పరీక్షలపై కొత్త వివాదం
- » యూజీసీనెట్ అవకతవకలు
- » విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన
- » కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు



యూజీసీనెట్ 2026 పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వరుసగా నీట్, నెట్ పరీక్షల విషయంలో వివాదాలు బయటపడుతున్నా ప్రభుత్వం కళ్లుమూసుకుని నిద్రపోతోందని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివినా వారి శ్రమకు కేంద్ర ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదని అన్నారు.

**100 పేజీల పీడీఎఫ్‌పై ఆరోపణలు**

యూజీసీనెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆ పత్రంలో ఉన్న దాదాపు 90 ప్రశ్నలు అసలు సోషియాలజీ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో సరిపోలుతున్నాయని ఆరోపించారు. ప్రశ్నాపత్రం రూపొందించే సమాచారం జాతీయ పరీక్షల సంస్థ వద్ద మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బిహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో రూ.2.25 లక్షలకు ప్రశ్నాపత్రాలను విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా రాహుల్ గాంధీ చేశారు. ఇదే నెట్‌వర్క్ రాబోయే సీఎస్ఐఆర్‌నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నాపత్రాలను కూడా అందిస్తామని ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పరీక్షల నిర్వహణపై కొత్త అనుమానాలకు దారితీశాయి.

**ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పుడు నెట్ పరీక్షపై కూడా ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి జవాబుదారీతనం ఆశించడం వృథా అని విమర్శించారు. ఈ వ్యవహారంలో విచారణ జరగదని, విద్యార్థులకు న్యాయం దక్కదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై ఈ ఆరోపణలు వచ్చినప్పటికీ, ఈ కథనం వెలువడే సమయానికి అధికారిక స్పందన రాలేదు. ఆరోపణలపై స్పష్టత రావాల్సి ఉంది. పరీక్షల పారదర్శకతపై ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.




- భాగ్యనగర రోడ్లపై వాహనాల కల్లోలం
- ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘినతో చలాన్లు
- రహదారుల దుస్థితి.. వాహనదారుడి గోస
- ట్రాఫిక్ జామ్‌లతో కోట్లాది ఇంధనం వృథా
- రాంగ్ రూట్ టెర్రర్.. అంబులెన్స్‌లకు దక్కని దారి
- పౌరుల బాధ్యతతోనే నగరానికి ట్రాఫిక్ విముక్తి

# నో ట్రాఫిక్ సెన్స్

**భాగ్యనగరంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండటంతో రహదారులపై క్రమశిక్షణ పెద్ద సవాలుగా మారింది. ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరైన హైదరాబాద్ రోడ్లు ఇప్పుడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు, వాహనాల హారన్ల శబ్దాలతో కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నాయి. ఐటీ రంగ విస్తరణ, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపడకపోవడంతో సొంత వాహనాల వాడకం పెరిగి, రోడ్లపై ఇష్టారాజ్యంగా ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువైంది. ఈ క్రమంలో ట్రాఫిక్ కల్లోలాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కఠినమైన జరిమానాలు, ఆటో-డెబిట్ చలాన్ల వంటి సాంకేతిక వ్యూహాలను పరిశీలిస్తోంది. కేవలం ఫ్లైఓవర్ల నిర్మాణమే కాకుండా, నగరంలో వాహనాల సగటు ప్రయాణ వేగం పెరిగి, సురక్షితమైన ప్రయాణం సాధ్యమైనప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. చట్టాల భయంతో పాటు పౌరులలో అంతర్గత బాధ్యత పెరిగినప్పుడే నగర రోడ్లకు ట్రాఫిక్ ఇబ్బందుల నుండి శాశ్వత విముక్తి లభిస్తుంది.**

## వైలేషన్‌తో నాన్‌సెన్స్

**హైదరాబాద్ నగరంలో ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోడ్లపై ప్రయాణించేటప్పుడు కనీస నియమాలు పాటించకపోవడం పెద్ద సమస్యగా మారుతోంది. ఇలాంటి వారికి ఎడాపెడా చలాన్లు విధించడం మాత్రమే ఏకైక పరిష్కారం. కఠిన శిక్షలు అమలు చేయడం ద్వారానే వ్యవస్థలో మార్పు వస్తుంది. రోడ్డు క్రమశిక్షణ లేకుంటే భారీ జరిమానాలు తప్పవనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలి. అప్పుడే ఈ భాగ్యనగర ట్రాఫిక్ కల్లోలం అదుపులోకి వస్తుంది. ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు రోడ్లపై చెలరేగిపోకుండా ఉండాలంటే చట్టం పట్ల భయం, గౌరవం సమానంగా ఉండాలి. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే ప్రవర్తనను ఎంతమాత్రం సహించకూడదు.**

### • ఇరవై ఏళ్ల నాటి రోడ్లు.. పది రెట్లు పెరిగిన వాహనాలు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి లాంటి కొన్ని ఆధునిక ఐటీ ప్రాంతాలు మినహాయిస్తే హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఇరవై ఏళ్ల క్రితం ఉన్న రహదారులే నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ రెండు దశాబ్దాల కాలంలో నగరంలో వాహనాల సంఖ్య పది రెట్లు పైగా పెరిగింది. దానికి అనుగుణంగా ప్రభుత్వ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపడలేదు. మెట్రో రైళ్లు, సిటీ బస్సులు పెరిగిన జనాభా అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఫలితంగా ప్రజలు సొంత వాహనాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు నగరంలో ఫుట్ పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం సర్వసాధారణమైంది. అనేక ప్రాంతాలలో వ్యాపారులు రోడ్లను కూడా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇది రహదారుల వైశాల్యాన్ని మరింత కుదించి ట్రాఫిక్ ఇబ్బందులను తీవ్రతరం చేస్తోంది.

### • హైదరాబాద్ చలానాల ఆదాయం!

భాగ్యనగరంలో నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠినంగా చలాన్లు వేస్తే ఆ వచ్చే ఆదాయం మొత్తం కీలక పథకాలకు ప్రభుత్వం ఏటా ఖర్చు పెడుతున్నంత ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటి వరకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు కేవలం మాటలతోనే అవగాహన కల్పించడానికి ప్రయత్నించారు. ఇకపై చేతల్లోనే కఠినత్వాన్ని చూపిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మాటలకే పరిమితం కాకుండా నగరవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేస్తే ఏటా వేల కోట్ల రూపాయల జరిమానాలు వసూలవుతాయి. నగరంలో మితిమీరుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనలను పూర్తిగా అరికట్టడానికి ప్రభుత్వం ఈసారి సరికొత్త వ్యూహాలతో కఠిన చర్యలకు సిద్ధమవుతోంది.

### • కాంక్రీట్ జంగిల్‌గా మారిన మన భాగ్యనగరం

హైదరాబాద్ మహానగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఐటీ రంగం విస్తరణ, రియల్ ఎస్టేట్ రంగం బూమ్, ఉపాధి అవకాశాల పెరుగుదలతో నగర జనాభా విపరీతంగా పెరిగింది. దాంతో పాటు వాహనాల సంఖ్య కూడా అదుపు తప్పే స్థాయికి చేరుకుంది. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటి హైదరాబాద్ ట్రాఫిక్ ఇప్పుడు పెను సంక్షోభంలో కూరుకుపోయింది. నగరంలో ఎటు చూసినా కిలోమీటర్ల మేర నిలిచిపోయే వాహనాలు, గంటల తరబడి వినిపించే హారన్ల శబ్దాలు పౌరుల జీవితాలను నరకంగా మారుస్తున్నాయి. ఒకప్పుడు ప్రశాంతతకు ఎంతో పేరుగాంచిన నగర రోడ్లు ఇప్పుడు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయాయి. రోడ్డుపైకి వస్తే చాలు క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకుంటామా లేదా అనే భయం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది. నిబంధనలు పాటించాల్సిన యువత రోడ్లపైకి వస్తే రేసింగులతో శివాలెత్తిపోతోంది. సమయం ఆదా చేసుకునే పేరుతో అమూల్యమైన ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

### • చలాన్ల చుట్టూ రాజకీయం.. సామాన్యుడి గోస

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం యోచిస్తున్న "ఆటోడెబిట్" చలాన్ల ప్రతిపాదన తీవ్ర చర్చకు దారితీసింది. వాహనం రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసి, తప్పు జరిగిన వెంటనే నేరుగా డబ్బులు కట్ చేసే ఈ ఆలోచనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇంకా పూర్తిగా అమలులోకి రాని ఈ ప్రతిపాదనలపై రాజకీయ విమర్శల రచ్చ అవసరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. విపక్షాలు, కార్మిక సంఘాలు దీనిని పేద, మధ్యతరగతి పౌరుల జేబులకు చిల్లు పెట్టే చర్యగా మండిపడుతున్నాయి. ఎన్నికల ముందు రాయితీల మాట చెప్పి, ఇప్పుడు అకౌంట్ల నుంచి నేరుగా నగదు గుంజాలని చూడటం సరికాదని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. సాధారణ వాహనదారుడి కోణంలో చూస్తే అసలు సమస్య వేరేలా ఉంది. నగరంలో రహదారుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. సరైన సిగ్నల్స్, సూచన బోర్డులు లేవు, రోడ్లపై గుంతల కారణంగా ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిలబడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన సిబ్బంది, కేవలం సీసీ కెమెరాల ద్వారా ఫోటోలు తీసి చలాన్లు వేయడంలోనే బిజీగా ఉంటున్నారనే ఆవేదన సామాన్యుల్లో ఉంది. మౌలిక వసతులు కల్పించకుండా కేవలం జరిమానాల టార్గెట్లు పెంచడం ఎంతవరకు న్యాయమని టాక్సీ, ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.

### • ద్విచక్ర వాహనాలదే అగ్రస్థానం

రాష్ట్రంలో అమ్ముడవుతున్న మొత్తం వాహనాల్లో ద్విచక్ర వాహనాలదే సింహభాగం అని రవాణా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్టర్ అయిన వాహనాలలో 7.26 లక్షలకు పైగా కేవలం టూ వీలర్లే ఉన్నాయి. అంటే మొత్తం కొనుగోళ్లలో 70 శాతానికి పైగా ప్రజలు బైక్‌లు, స్కూటర్లకే మొగ్గు చూపారు. వీటి తర్వాత 1.62 లక్షల కార్లు అమ్ముడై రెండో స్థానంలో నిలిచాయి. వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రైలర్లు 54 వేల రిజిస్ట్రేషన్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. సొంత వాహనాలతో పాటు ప్రజల ప్రజా రవాణా అవసరాల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా తన సేవలను విస్తరించింది. గత ఏడాది కాలంలో ఆర్టీసీ వ్యవస్థలోకి 1,052 కొత్త బస్సులను చేర్చారు. అలాగే వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులు 883 రిజిస్టర్ అయ్యాయి. నగరాల్లో ఆటోరిక్షాలు 47 వేలు, సరుకు రవాణా వాహనాలు 39 వేలకు పైగా కొత్తగా రోడ్లపైకి వచ్చాయి. పెరుగుతున్న ఈ వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఉంది.

### • ట్రాఫిక్ జామ్‌ల వల్ల కోట్ల రూపాయల ఇంధనం వృథా

నగరంలో రోజూ కోట్ల రూపాయల విలువైన పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతోంది. ట్రాఫిక్ జామ్‌లలో గంటల తరబడి ఇంజిన్ ఆన్ చేసి నిలిచిపోవడం వల్ల ఇంధన వృథా మరింత పెరుగుతోంది. కేవలం 10 కిలోమీటర్ల ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతోంది. ఒకవైపు ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండగా, మరోవైపు ట్రాఫిక్ కారణంగా వాహనదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ఇంజిన్ల నుంచి వస్తున్న విపరీతమైన వేడి, పొగ నగర వాతావరణాన్ని విషపూరితంగా మారుస్తున్నాయి. కాలుష్యం కారణంగా నగర ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు కాలుష్య ప్రభావంతో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

### • రాంగ్ రూట్ మహమ్మారి.. రోడ్లపై ప్రాణాంతక ప్రయాణాలు

నగరంలో ప్రస్తుతం ప్రధాన సమస్యల్లో ఒకటి రాంగ్ రూట్ డ్రైవింగ్. సమయం ఆదా చేసుకునే పేరుతో చాలామంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా పక్కనబెడుతున్నారు. సిగ్నల్ జంపింగ్, యూ టర్న్‌ల వద్ద రాంగ్ ఎంట్రీలు, రేసింగ్ తరహా డ్రైవింగ్, ఫుట్ పాత్‌లపై బైకులు నడపడం రోజువారీ దృశ్యాలుగా మారిపోయాయి. యూటర్న్ వరకు వెళ్లడానికి బద్ధకించి, కేవలం వంద మీటర్ల దూరాన్ని ఆదా చేసుకోవడానికి రోడ్డుకు అవతలి వైపు నుంచి రావడం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులు అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. ఇది పెద్ద ఎత్తున ఘోర ప్రమాదాలకు దారితీస్తోంది. ముఖ్యంగా నేటి యువతలో ట్రాఫిక్ సెన్స్ పూర్తిగా లోపించిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### • అంబులెన్స్‌లకు దక్కని దారి.. నిస్సహాయ స్థితిలో రోగులు

ట్రాఫిక్ జామ్‌ల వల్ల జరిగే అతిపెద్ద నష్టం అత్యవసర సేవలపై పడుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లే అంబులెన్స్‌లు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. రోడ్డుపై వాహనాలు ఎంత గజిబిజిగా, ఇష్టారాజ్యంగా పార్క్ చేసి ఉంటాయంటే కనీసం ఒక బైక్ వెళ్లడానికి కూడా సందు ఉండటం లేదు. అంబులెన్స్ సైరన్ వినిపించినా వాహనాలను పక్కకు జరిపే స్థలం లేక డ్రైవర్లు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఐదు నిమిషాల ఆలస్యం ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంటున్న సంఘటనలు నగరంలో ఎన్నో జరుగుతున్నాయి. ఒక అత్యవసర సమయంలో ప్రాణాన్ని కాపాడలేనప్పుడు ఈ వందల కోట్ల ఫ్లైఓవర్ల అభివృద్ధికి అర్థం ఏముందని పౌరులు ప్రశ్నిస్తున్నారు. డేటా ప్రకారం, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినందుకు 31.1 లక్షలకు పైగా కేసులు, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడినందుకు 98,572 కేసులు నమోదు అయ్యాయి. అయితే కఠినమైన తనిఖీలు, కౌన్సెలింగ్ చర్యల కారణంగా.. మద్యం తాగి వాహనం నడిపే కేసులు కొంత మేర తగ్గాయి.

### • గంటకు 30 కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు అదే అసలైన అభివృద్ధి

తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే 2026 పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం 2024 సంవత్సరంలో గంటకు 20.1 కిలోమీటర్లుగా ఉన్న సగటు ప్రయాణ వేగం, 2025 నాటికి 23.4 కిలోమీటర్లకు చేరుకుంది. రోడ్లపై వాహనాలు పెరుగుతున్నా వేగం ఎలా పెరిగిందనే ప్రశ్న అందరిలోనూ ఆశ్చర్యం కలిగిస్తోంది. 2021లో సగటున గంటకు 25 కిలో మీటర్లకు చేరగా.. ఇప్పుడు ఇన్ని రకాలుగా రోడ్ల విస్తీర్ణం చేసినా.. పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. రవాణా నిపుణుల అభిప్రాయం ప్రకారం నగర రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందిందని చెప్పడానికి కేవలం భారీ భవనాలు, ఫ్లైఓవర్లు మాత్రమే ప్రమాణాలు కావు. ఒక సాధారణ పౌరుడు నగరంలో ఎంత వేగంగా, ఎంత సులభంగా ప్రయాణించగలుగుతున్నాడనేదే అసలైన అర్బన్ డెవలప్‌మెంట్ సూచిక. నగరంలో వాహనాల సగటు ప్రయాణ వేగం గంటకు 30 కిలోమీటర్లకు చేరితే హైదరాబాద్ నిజమైన విశ్వనగరంగా మారినట్టే. ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ నిర్వహణలో ఇదే కీలక ప్రమాణంగా భావిస్తారు. ఒక ఉద్యోగి సమయానికి ఆఫీసుకు చేరుకోవడం, అంబులెన్స్ వేగంగా ఆసుపత్రికి వెళ్లడం వంటివి జరిగినప్పుడే నగర జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

### • రోడ్డు సంస్కృతి మారాలి.. మార్పు మన నుంచే మొదలవ్వాలి

ట్రాఫిక్ సమస్యకు కేవలం రోడ్ల కొరతే కారణం కాదు. వాహనదారుల ప్రవర్తన, పార్కింగ్ వ్యవస్థలో లోపాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగం తగ్గడం కూడా ప్రధాన కారణాలే. రోడ్లు విస్తరించడం మాత్రమే పరిష్కారం కాదు, ప్రజల్లో రోడ్డు సంస్కృతి మారాలి. చట్టాల ద్వారా భయంతో కూడిన క్రమశిక్షణను టీస్పూన్స్ తీసుకురావడం ఒక మార్గమైతే, పౌరులుగా మనలో కూడా బాధ్యత పెరగాలి. "ఎవరో చూస్తున్నారని కాదు, నా ప్రాణం తోటివారి ప్రాణం ముఖ్యం" అని ప్రతి ఒక్కరూ భావించినప్పుడే నగర రోడ్లకు నిజమైన విముక్తి లభిస్తుంది. కఠిన నిబంధనలు, ప్రజల్లో అవగాహన, మెరుగైన పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, టెక్నాలజీ ఆధారిత ట్రాఫిక్ నియంత్రణ అన్నీ కలిసివస్తేనే హైదరాబాద్ రోడ్లకు ఊపిరి దొరుకుతుంది.

### • బాధ్యతాయుత ప్రవర్తన.. కఠిన నియమాలే మార్గం!

హైదరాబాద్ నగర రహదారులపై సాగుతున్న ట్రాఫిక్ కల్లోలానికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలను సరైన దారిలోకి తీసుకురావడం అత్యవసరం. దీనికోసం రెండు రకాల వ్యూహాలు అమలు చేయాలి. మొదటిది, పౌరులలో అంతర్గత బాధ్యతను పెంచడం. ప్రతి వాహనదారుడు "నా ప్రాణంతో పాటు తోటివారి ప్రాణం కూడా ముఖ్యమే" అనే భావనను అలవర్చుకోవాలి. అడ్డగోలు పార్కింగ్‌లను వీడి, వీలైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. పాఠశాలలు, కార్యాలయాల స్థాయి నుంచే ట్రాఫిక్ క్రమశిక్షణపై విస్తృత అవగాహన కల్పించాలి. రెండోది, చట్టాన్ని పక్కాగా అమలు చేయడం ద్వారా భయంతో కూడిన క్రమశిక్షణను నిర్మించడం. స్వచ్ఛందంగా మారని వాహనదారులను దారిలోకి తెచ్చేందుకు అత్యాధునిక డిజిటల్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచాలి. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర తప్పిదాలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, పదే పదే తప్పులు చేస్తే లైసెన్స్‌ల రద్దు, జైలు శిక్ష వంటి కఠిన చర్యలు తీసుకోవాలి.

అవగాహన,

### తెలంగాణలోనే హైదరాబాద్ నెంబర్ వన్


తెలంగాణ రాష్ట్రంలో కొత్త వాహనాల కొనుగోళ్లు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. గడిచిన 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 10.62 లక్షల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అంటే నగరాలు, పల్లెల్లో కలిపి ప్రతిరోజూ సగటున 2,900 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అయితే ఈ మొత్తం కొనుగోళ్లలో సగానికి పైగా వాహనాలు కేవలం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే నమోదు కావడం విశేషం. ఐటీ కారిడార్, పారిశ్రామికాభివృద్ధి ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలే ఈ జోరుకు ప్రధాన కారణమని రవాణా శాఖ తాజా నివేదికలో వెల్లడించింది. రాష్ట్రవ్యాప్త వాహన రిజిస్ట్రేషన్ల జాబితాలో రాజధాని హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఒక్క జిల్లాలోనే గత ఏడాది 1,97,539 కొత్త వాహనాలు అమ్ముడయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో 1,87,044 వాహనాలతో రంగారెడ్డి జిల్లా, 1,75,630 వాహనాలతో మేడ్చల్ జిల్లా నిలిచాయి. ఈ మూడు జిల్లాల పరిధిలోనే దాదాపు 5.60 లక్షల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సంఖ్య పెరగడం, మౌలిక వసతుల విస్తరణ కారణంగా ఈ ప్రాంతాల్లో సొంత వాహనాల కొనుగోలుపై ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. రవాణా శాఖ అధికారిక లెక్కల ప్రకారం 31032025 నాటికి రాష్ట్రంలో మొత్తం వాహనాల సంఖ్య కోటి 73 లక్షలపైనే. ఇందులో మోటార్ సైకిళ్లు కోటి 27 లక్షల వరకు ఉండగా, మోటార్ కార్లు 23 లక్షలకు పైగా ఉన్నాయి. ఆటోరిక్షాలు 5 లక్షలుపైనే. కేవలం హైదరాబాద్ నగరంలోనే 90 లక్షలకు పైనే వాహనాలు ప్రతిరోజూ రోడ్లపై తిరుగుతున్నాయి.

### మన ఆలోచన మారాలి..

**- పొన్నం ప్రభాకర్, తెలంగాణ రవాణా శాఖ మంత్రి**



హైదరాబాద్ నగర ట్రాఫిక్ కల్లోలానికి ముగింపు పలకాలంటే భారీ ఫ్లైఓవర్లతోపాటు, మన ఆలోచనా విధానంలో మార్పేకీలకం. ప్రయాణంలో సమయం ఆదా చేసుకోవాలనే తొందరలో రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం, సిగ్నల్ జంపింగ్‌లకు పాల్పడటం లాంటి ప్రమాదకర పద్ధతులను పూర్తిగా పక్కనబెట్టాలి. రోడ్డుపై సైరన్ శబ్దం వినబడగానే మానవత్వంతో స్పందించి, అంబులెన్స్‌కు దారివ్వాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలి. వారంలో కనీసం ఒక్క రోజైనా సొంత వాహనాలకు విశ్రాంతినిచ్చి, మెట్రో లేదా సిటీ బస్సుల వంటి ప్రజా రవాణా వ్యవస్థలను వినియోగించడం అలవాటు చేసుకోవాలి. చట్టాల భయంతో కాకుండా, "నా ప్రాణంతో పాటు తోటివారి ప్రాణమూ ముఖ్యమే" అనే స్వీయ నియంత్రణ ప్రతి వాహనదారుడిలోనూ మొదలైనప్పుడే భాగ్యనగర రహదారులపై ప్రతి ప్రయాణం సురక్షితంగా, సుఖమయంగా మారుతుంది.



# రాజకీయ సహజీవనం..
# రాంగ్ రూటులో..
# ప్రేమాయణం
## ఏరులై పారుతున్న ప్రేమరసం



- తేలిపోతుందా? పేలిపోతుందా?
- క్లైమాక్సా... యాంటీ క్లైమాక్సా..?
- దువ్వాడ–దివ్వెల ప్రేమకథ హిట్టా... ఫట్టా!
- సహజీవన రాజకీయం టెక్కలిలో రక్తికడుతుందా?

రాజకీయాల్లో ప్రత్యర్థులు మారుతుంటారు... సిద్ధాంతాలు మారుతుంటాయి... పార్టీలు మారుతుంటాయి. కానీ ప్రజలు మరచిపోని అంశం ఏదైనా ఉంటే అది నాయకుల వ్యక్తిగత జీవితమే. ఆ వ్యక్తిగత జీవితం రాజకీయాలపై ప్రభావం చూపడం ప్రారంభిస్తే, అది వార్త మాత్రమే కాదు... చర్చ కూడా అవుతుంది. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అలాంటి చర్చకు కేంద్రబిందువుగా నిలిచిన జంట దువ్వాడ శ్రీనివాస్-దివ్వెల మాధురి. రాజకీయ పరిచయంతో మొదలైన ఈ బంధం, తర్వాత ప్రేమగా, ఆపై సహజీవనంగా మారి చివరకు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకప్పుడు సభల్లో పార్టీ కోసం నినాదాలు చేసిన వారు... ఇప్పుడు ఒకరి కోసం మరొకరు నిలబడే స్థితికి చేరుకున్నారు. రాజకీయ వేదికల నుంచి సోషల్ మీడియా వరకు, టీవీ స్టూడియోల నుంచి కోర్టు పరిసరాల వరకు, పోలీస్ స్టేషన్‌ల నుంచి రీల్స్ ప్రపంచం వరకు ఈ ఇద్దరి ప్రయాణం సాగింది. రాజకీయ నాయకుల కంటే సెలబ్రిటీలుగా వీరి పేరు ఎక్కువగా వినిపించే పరిస్థితి ఏర్పడింది.

**రాజకీయాల్లో సాధారణంగా కథ మొదలవుతుంది సభతో... ముగుస్తుంది ఎన్నికలతో. కానీ ఈ జంట కథ మాత్రం ప్రేమతో మొదలై, మీడియా కెమెరాల మధ్య పెరిగి, సోషల్ మీడియా రీల్స్‌లో పరుగెత్తి, ఇప్పుడు రాజకీయ క్లైమాక్స్ కోసం ఎదురుచూస్తున్న సీరియల్‌గా మారింది. ఒకప్పుడు పార్టీ జెండా మోసిన చేతులు... ఇప్పుడు ప్రేమకు చప్పట్లు కొడుతున్నాయా? లేక రాజకీయ భవిష్యత్తుకు ఓట్లు అడగడానికి సిద్ధమవుతున్నాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రేమకు దర్శకుడు విధి అయితే, ప్రచారానికి నిర్మాత సోషల్ మీడియా అన్నట్టుగా ప్రతి మలుపు వైరల్ అవుతోంది. ప్రతి ఎపిసోడ్‌కు కొత్త ట్విస్ట్, ప్రతి ట్విస్ట్‌కు కొత్త డిబేట్, ప్రతి డిబేట్‌కు కొత్త రీల్... ఇదే దువ్వాడ–దివ్వెల కథ ప్రత్యేకత. ఇక అసలు ప్రశ్న ఒక్కటే... ఈ ప్రేమకథకు చివర్లో "హ్యాపీ ఎండింగ్" కార్డు పడుతుందా? లేక రాజకీయ తెరపై యాంటీ క్లైమాక్స్‌తో ముగుస్తుందా? ఓటర్లు చప్పట్లు కొడతారా, తీర్పు చెబుతారా, లేక ఈ కథను మరో వైరల్ జ్ఞాపకంగా పక్కన పెట్టేస్తారా? సమాధానం మాత్రం రాబోయే రాజకీయ కాలమే రాయాల్సి ఉంది.**

### ప్రేమతో పాటు వివాదాలూ వైరల్

ప్రేమకు హద్దులు ఉండవని కవులు చెబుతారు. కానీ సమాజం మాత్రం కుటుంబం, బాధ్యత, బంధాలనే ముందు ఉంచుతుంది. ఈ నేపథ్యంలో దువ్వాడ-దివ్వెల వ్యవహారం ప్రేమకథ కంటే కుటుంబ వివాదంగానే ఎక్కువ మందికి కనిపించింది. ఒకవైపు భార్యా పిల్లలు... మరోవైపు భర్త కుటుంబం... ఇద్దరి ఇళ్లలోనూ ఆవేదన, ఆరోపణలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. కుటుంబాల మధ్య మొదలైన విభేదాలు చివరకు బహిరంగ చర్చగా మారాయి. ఈ ప్రేమకథకు మీడియా కూడా తనదైన రంగులు అద్దింది. ఒక దశలో దాదాపు అన్ని న్యూస్ ఛానళ్లు వీరిద్దరినీ ఇంటర్వ్యూల కోసం పోటీ పడ్డాయి. స్టూడియోల్లో నవ్వులు, సరదా మాటలు, పాటలు, నృత్యాలు... ఇలా రాజకీయ చర్చల కంటే వ్యక్తిగత జీవితమే ప్రధాన అంశంగా మారింది. 24 గంటల వార్తా ప్రసారాల్లో కూడా ఈ జంటకు ప్రత్యేక స్థానం దక్కింది. కాలక్రమేణా సోషల్ మీడియా ఈ కథకు కొత్త అధ్యాయాన్ని జోడించింది. హైదరాబాద్‌లో బట్టల దుకాణం ప్రారంభించడం, రీల్స్ రూపొందించడం, కలిసి కనిపించడం, అభిమానులతో వీడియోలు పంచుకోవడం... ఇవన్నీ రాజకీయ నాయకుల కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను తలపించేలా మారాయి. ప్రేమను వ్యక్తిగతంగా కాకుండా ప్రజల ముందే ప్రదర్శించే కొత్త తరహా రాజకీయసోషల్ కల్చర్‌కు వీరు ప్రతీకగా నిలిచారని కొందరు వ్యాఖ్యానించారు.

### ప్రేమను మించిన రాజకీయ కలకలం

అయితే కథ అంతా ప్రేమతోనే సాగలేదు. వివాదాలు కూడా వెంటాడాయి. దువ్వాడ శ్రీనివాస్‌పై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, వైసీపీ నుంచి సస్పెండ్ చేయడం, అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, ఇటీవల ఆయన అరెస్టు ప్రచారం సంఘటనలు మళ్లీ ఈ జంటను వార్తల్లో నిలిపాయి. ఆ సమయంలో దివ్వెల మాధురి రోడ్డుపై ఆందోళనకు దిగడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం కూడా విస్తృత చర్చకు దారితీసింది. ప్రేమలో లైలా-మజ్నూ... సలీం-అనార్కలి... రోమియో-జూలియట్ వంటి ప్రేమ జంటలు చరిత్రలో నిలిచాయి. అయితే అవి కల్పిత గాథలైనా, చారిత్రక ప్రేమకథలైనా రాజకీయ ప్రచారానికి వేదిక కాలేదు. దువ్వాడ-దివ్వెల కథ మాత్రం రాజకీయం, మీడియా, సోషల్ మీడియా, వినోదం అన్నీ కలిసిన కొత్త తరహా ప్రజా కథనంగా మారింది. ప్రేమను ప్రైవేట్ జీవితంలో కాకుండా పబ్లిక్ స్టేజ్‌పై జీవించడం ఈ జంట ప్రత్యేకతగా నిలిచింది. ఇప్పటికే దివ్వెల మాధురి వినోద రంగం, రియాలిటీ షోల ద్వారా కూడా ప్రజలకు పరిచయం కావడం, దువ్వాడతో కలిసి బహిరంగంగా కనిపించడం, "నా రాజాను చూడకుండా ఉండలేను" అన్నట్టుగా మాట్లాడిన వీడియోలు వైరల్ కావడం ఈ కథకు మరింత ప్రచారం తీసుకొచ్చాయి. అభిమానులు దీన్ని ప్రేమగా చూస్తే, విమర్శకులు దీనిని కుటుంబ విలువలకు విరుద్ధమైన ఉదాహరణగా అభివర్ణిస్తున్నారు.

### 2029లో ఎన్నికల బరిలో ప్రేమజంట?

ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న మొదలవుతోంది. ప్రేమతో మొదలైన ఈ ప్రయాణం రాజకీయాల్లో కూడా కొనసాగుతుందా? 2029 ఎన్నికల నాటికి వీరిద్దరిలో ఎవరో ఒకరు ఎన్నికల బరిలోకి దిగుతారా? లేక ఇద్దరూ వేర్వేరు రాజకీయ అవకాశాలను వెతుకుతారా? ప్రస్తుతం ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. అయినప్పటికీ రాజకీయ వర్గాల్లో ఈ అవకాశాలపై చర్చ మాత్రం కొనసాగుతోంది. ఒకవేళ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయిస్తే ఏ పార్టీ అవకాశం ఇస్తుంది? వైసీపీ మళ్లీ అవకాశం కల్పిస్తుందా? లేక మరో రాజకీయ పార్టీ కొత్త సమీకరణాల దిశగా ఆలోచిస్తుందా? లేక స్వతంత్ర అభ్యర్థులుగా అదృష్టాన్ని పరీక్షించుకుంటారా? ఇవన్నీ ఇప్పటికైతే ఊహాగానాలే. పోటీ చేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారు? రాజకీయ అనుభవం, ప్రజా సేవ, స్థానిక సమస్యలపై అవగాహన ఆధారంగా ఓటు వేస్తారా? లేక ఇప్పటికే మీడియాలో ఏర్పడిన గుర్తింపే ఎన్నికల్లో కూడా ఉపయోగపడుతుందా? ఇవి ఎన్నికల సమయానికే తేలే ప్రశ్నలు.

### దువ్వాడ-దివ్వెలకు క్లైమాక్సా.. యాంటీ క్లైమాక్సా?

ఒకవేళ ఏ రాజకీయ పార్టీ కూడా అవకాశం ఇవ్వకపోతే? అప్పుడు ఈ ప్రేమజంట రాజకీయాల నుంచి పూర్తిగా దూరమై తమ వ్యక్తిగత జీవితం, వ్యాపారం, సోషల్ మీడియా ప్రపంచానికే పరిమితమవుతుందా? లేక ప్రజా జీవితంలో మరో కొత్త రూపంలో కనిపిస్తుందా? అనేది కూడా ఆసక్తికర అంశమే. రాజకీయాల్లో వ్యక్తిగత జీవితం పూర్తిగా వ్యక్తిగతంగా మిగిలిపోదు. ప్రజాప్రతినిధుల ప్రతి నిర్ణయం, ప్రతి సంబంధం, ప్రతి వివాదం ప్రజల పరిశీలనలోనే ఉంటుంది. అందుకే ప్రేమ కూడా రాజకీయాల్లోకి అడుగుపెడితే అది కేవలం ఇద్దరి కథగా ఉండదు; సమాజం, కుటుంబం, ప్రజాభిప్రాయం, రాజకీయ భవిష్యత్... అన్నీ కలిసి తీర్పు చెప్పే అంశంగా మారుతుంది. దువ్వాడ-దివ్వెల కథ చివరికి ప్రేమ విజయగాథగా నిలుస్తుందా? రాజకీయ ప్రయాణంగా మలుపు తిరుగుతుందా? లేక కాలక్రమేణా మరో వైరల్ అధ్యాయంగా మాత్రమే మిగిలిపోతుందా? దీనికి సమాధానం చెప్పేది కాలమే. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం... ఈ ప్రేమకథ ఇప్పటికే రాజకీయాల చరిత్రలో ఒక విభిన్న అధ్యాయంగా నిలిచిపోయింది. ప్రేమ పక్షులు రాజకీయ చెట్టుపై గూడు కట్టిన ఈ కథకు చివరి పేజీ ఇంకా రాయాల్సి ఉంది.

---




# స్పామ్ కాల్స్‌పై పోరు

- ట్రూకాలర్‌కు ట్రాయ్ చెక్
- స్పామ్ హెచ్చరికలపై కొత్త వివాదం
- ట్రాయ్ నిర్ణయంపై ట్రూకాలర్ అభ్యంతరం

స్పామ్ కాల్స్‌ను అడ్డుకునే పోరాటం ఇప్పుడు రెండు వ్యవస్థల మధ్య ఆధిపత్య పోరుగా మారుతోంది. ఒకవైపు టెలికాం రంగాన్ని నియంత్రించే ట్రాయ్... మరోవైపు కోట్లాది మంది వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించిన ట్రూకాలర్. ప్రజలకు ఏ సమాచారం చూపించాలి? ఏది దాచాలి? అన్న ప్రశ్న ఇప్పుడు ఈ వివాదానికి కేంద్రంగా నిలిచింది. అధికారిక నంబర్లను స్పామ్‌గా గుర్తించొద్దని ట్రాయ్ చెబుతుంటే, అలాంటి నంబర్ల నుంచే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని ట్రూకాలర్ వాదిస్తోంది. దీంతో ఈ పోరు కేవలం ఒక యాప్, ఒక నియంత్రణ సంస్థ మధ్య పరిమితం కాకుండా డిజిటల్ స్వేచ్ఛ, వినియోగదారుల హక్కులు, ప్రభుత్వ నియంత్రణ మధ్య జరుగుతున్న పెద్ద యుద్ధంగా మారుతోంది. ఈ పోరులో పైచేయి ఎవరిది? ట్రాయ్ కొత్త నిబంధనలు అమలు చేస్తుందా? లేక ట్రూకాలర్ తన హెచ్చరిక వ్యవస్థను కొనసాగిస్తుందా? ఈ నిర్ణయం భారత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే ట్రాయ్‌ట్రూకాలర్ మధ్య మొదలైన ఈ వివాదాన్ని టెక్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది.

### 140, 160 సిరీస్ నంబర్లే కేంద్రబిందువు

కాల్ గుర్తింపు సేవలను అందించే ట్రూకాలర్ సంస్థకు భారత టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్)తో కొత్త వివాదం మొదలైంది. స్పామ్ కాల్స్‌కు సంబంధించిన హెచ్చరికలను కొన్ని ప్రత్యేక నంబర్లపై చూపకుండా ఉండాలని ట్రాయ్ తీసుకున్న నిర్ణయాన్ని ట్రూకాలర్ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజల భద్రతకు ఉపయోగపడే సమాచారాన్ని అడ్డుకోవడం సరైన చర్య కాదని సంస్థ అభిప్రాయపడింది. ఈ అంశంపై ట్రూకాలర్ సీఈఓ రిషిత్ ఝుంఝున్‌వాలా బహిరంగంగా స్పందించడం చర్చకు దారితీసింది. ప్రచార కాల్స్ కోసం 140 సిరీస్, బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన కాల్స్ కోసం 160 సిరీస్ నంబర్లను తప్పనిసరిగా ఉపయోగించాలని ట్రాయ్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ నంబర్లను స్పామ్‌గా గుర్తించకుండా ట్రూకాలర్ వంటి యాప్‌లు వైట్ లిస్ట్ చేయాలని కూడా సూచించింది. మొదట ఈ ఆదేశాలను ట్రూకాలర్ పాటించినా, దాని వల్ల స్పామ్ కాల్స్ గణనీయంగా పెరిగాయని సంస్థ వెల్లడించింది. లక్షలాది మంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది.

### రోజుకు కోట్ల కాల్స్‌కు స్పందన లేదు

ట్రూకాలర్ సీఈఓ తెలిపిన వివరాల ప్రకారం 140, 160 సిరీస్‌ల నుంచి వచ్చే 5.1 కోట్లకుపైగా కాల్స్‌కు ప్రతిరోజూ స్పందన లభించడం లేదు. వినియోగదారులు ఆ కాల్స్‌ను నమ్మడం లేదని ఆయన చెప్పారు. రోజుకు లక్షకు పైగా కాల్స్‌ను వినియోగదారులు బ్లాక్ చేస్తున్న పరిస్థితి కనిపించడంతో "ఫ్రీక్వెంట్లీ బ్లాక్డ్" అనే కొత్త గుర్తింపును ట్రూకాలర్ ప్రవేశపెట్టింది. ఈ గుర్తింపు వైట్ లిస్ట్ చేసిన నంబర్లపైనా కనిపించేలా రూపొందించింది. ట్రూకాలర్ ఈ కొత్త గుర్తింపును చూపడం ట్రాయ్‌కు అభ్యంతరంగా మారింది. కాలర్ ఐడీ యాప్‌లను నియంత్రించే అధికారాన్ని ఇవ్వాలని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు ట్రాయ్ లేఖ రాసినట్లు సమాచారం. ప్రస్తుతం టెలికాం సంస్థలను ట్రాయ్ నియంత్రిస్తున్నా, యాప్‌లపై నేరుగా నియంత్రణ అధికారంపై స్పష్టత లేకపోవడం కొత్త చర్చకు కారణమైంది. కేంద్ర ప్రభుత్వం నుంచి దీనిపై అధికారిక స్పందన మాత్రం వెలువడలేదు.

### వినియోగదారుల భద్రతే ప్రధానం: ట్రూకాలర్

ఇటీవలి కాలంలో ప్రభుత్వ విభాగాలు డిజిటల్ వేదికల పనితీరుపై మరింత దృష్టి సారిస్తున్నాయి. వాట్సాప్ వంటి సేవల విషయంలో కూడా పలు మార్పులు సూచించిన సందర్భాలు ఉన్నాయి. అదే తరహాలో కాలర్ ఐడీ యాప్‌ల పనితీరుపైనా నియంత్రణ అవసరమా అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వినియోగదారుల భద్రత, మోసాల నియంత్రణ, డిజిటల్ స్వేచ్ఛ మధ్య సమతుల్యత ఎలా ఉండాలన్నది కీలక ప్రశ్నగా నిలిచింది. ప్రజలకు నమ్మకమైన కమ్యూనికేషన్ అనుభవాన్ని అందించడం తమ ప్రధాన లక్ష్యమని ట్రూకాలర్ స్పష్టం చేసింది. ముఖ్యంగా వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారిని స్పామ్ కాల్స్, మోసాల నుంచి రక్షించడంలో తమ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని దాచిపెట్టడం వల్ల మోసగాళ్లకు మరింత అవకాశం కలుగుతుందని సంస్థ హెచ్చరించింది. ట్రాయ్ ప్రతిపాదన వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ట్రూకాలర్ అభిప్రాయపడింది.

---



# ఆళ్లగడ్డలో హైటెన్షన్

- అహోబిలం తలనీలాల సెగ
- ఆరోపణలపై పొలిటికల్ వార్
- సవాళ్లతో వేడెక్కిన రాజకీయం

అహోబిలం మఠంలో తలనీలాల వ్యవహారంపై మొదలైన ఆరోపణలు నంద్యాల జిల్లా రాజకీయాలను ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మార్చాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి చేసిన అవినీతి ఆరోపణలను టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్రంగా ఖండిస్తూ, వాటిని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ప్రకటించినట్లుగానే అహోబిలానికి చేరుకున్న అఖిలప్రియ చర్యతో రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. మరోవైపు బ్రిజేంద్రరెడ్డిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకోవడంతో పరిస్థితి మరింత చర్చనీయాంశమైంది. ఇరు వర్గాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో అహోబిలం, ఆళ్లగడ్డలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరోపణలు, ప్రతి ఆరోపణలు, సవాళ్లు, పోలీసుల అప్రమత్తత మధ్య ఈ వ్యవహారం ఇప్పుడు నంద్యాల జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అహోబిలం మఠంలో తలనీలాల అంశంపై తెలుగుదేశం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైసీపీ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగుతోంది. అహోబిలం మఠంలో అక్రమాలు జరిగాయని బ్రిజేంద్రరెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలకు అఖిలప్రియ ఘాటుగా స్పందిస్తూ తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. తనపై చేసిన ఆరోపణలను ప్రత్యక్షంగా వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు.

### రాజీనామా చేస్తానంటూ సవాల్

ఆరోపణలు నిజమని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అఖిలప్రియ ప్రకటించారు. నిరూపించలేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని బ్రిజేంద్రరెడ్డిని డిమాండ్ చేశారు. ప్రకటించినట్లుగానే ఆమె అహోబిలం చేరుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు బ్రిజేంద్రరెడ్డి కూడా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవగా, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయనను మార్గమధ్యంలో అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది.

### పోలీసుల కట్టుదిట్టమైన భద్రత

అహోబిలం నుంచి ఆళ్లగడ్డకు అఖిలప్రియ బయలుదేరారనే సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాజీ ఎమ్మెల్యే గంగుల నాని నివాసానికి ఆమె వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారంతో భద్రతను మరింత పెంచారు. గంగుల నాని ఇంటి పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతి భద్రతల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

### రాజకీయంగా ప్రాధాన్యత

గంగుల బ్రిజేంద్రరెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించేందుకు అహోబిలానికి వెళ్లకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అదే సమయంలో అఖిలప్రియ ఆళ్లగడ్డకు రావడం పరిస్థితిని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. ఇరు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని పోలీసులు చెబుతున్నప్పటికీ, అఖిలప్రియ తదుపరి చర్యలు, గంగుల బ్రిజేంద్రరెడ్డి స్పందనపై నంద్యాల జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

---

# రావణ్‌కు మద్దతుపై ఆనం ఆగ్రహం

- హిందూ మనోభావాలే ముఖ్యమని వ్యాఖ్య
- వైసీపీ తీరుపై మంత్రి తీవ్ర విమర్శలు



హిందూ దేవతలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రావణ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలగపూడి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కోట్లాది మంది హిందువుల మనోభావాల కంటే ఒక వ్యక్తి వ్యాఖ్యలకే వైసీపీ ప్రాధాన్యం ఇస్తోందా అని ప్రశ్నించారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటే వైసీపీ నేతలు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని నిలదీశారు. స్వార్థ రాజకీయాల కోసం మత విద్వేషాలను రెచ్చగొట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. హిందూ సమాజాన్ని కించపరిచే వ్యాఖ్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా పరిమితులు దాటి మాట్లాడితే కూటమి ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. యూట్యూబర్ రావణ్‌కు మద్దతు ఇస్తున్న అంశంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.

# హిందువుల మనోభావాలే ముఖ్యం

- రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ సత్యకుమార్



హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వారిని సమర్థించడం దురదృష్టకరమన్నారు మంత్రి సత్యకుమార్ యాదవ్. రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రావణ్ వ్యాఖ్యలను సమర్థించడం ద్వారా వైసీపీ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై ప్రభుత్వం రాజీపడబోదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో అభివృద్ధినే ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల ముందుకు వెళ్తామని, అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్ఠానం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# తప్పుడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

- జోసెఫ్ రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ విజయసాయి రెడ్డి



జోసెఫ్ రావణ్ వ్యాఖ్యలపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ జోసెఫ్ రావణ్‌కు, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు మద్దతు ఇస్తున్నది ఎవరో ప్రజలకు తెలియాలని ప్రశ్నించారు. వారిద్దరూ ఏ సంస్కృతికి వారసులో చెప్పాలని, వారి మూలాలు ఏమిటో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే వారికి చట్టం, సమాజం తగిన బుద్ధి చెప్పాలని విజయసాయి రెడ్డి అన్నారు. అలాంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించరాదని, అవసరమైతే అత్యంత కఠిన శిక్షలు విధించాలని అభిప్రాయపడ్డారు. మతం మారిన కొన్ని కుటుంబాలు హిందుత్వంపై విషం చిమ్ముతున్నాయని ఆరోపించారు. జోసెఫ్ రావణ్, ప్రకాశ్‌రాజ్‌లను వైసీపీ సమర్థించడం దేశంపై జరుగుతున్న దాడిగా భావించాలని వ్యాఖ్యానించారు. దేశద్రోహ కుట్రలపై ప్రభుత్వాలు రాజీపడకుండా కఠినంగా వ్యవహరించాలని విజయసాయి రెడ్డి కోరారు.

# రావణ్‌కు వైసీపీతో సంబంధం లేదు

- తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజం
- అంతా టీడీపీ కుట్రేనన్న కొడాలి నాని



యూట్యూబర్ రావణ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. గుడివాడలో మీడియాతో మాట్లాడుతూ, రావణ్ టీడీపీ నాయకులు చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, బాలకృష్ణలకు అనుకూలంగా వ్యవహరించిన వ్యక్తేనని అన్నారు. అయినప్పటికీ ఆయనను వైసీపీ వ్యక్తిగా చిత్రీకరిస్తూ టీడీపీ, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రావణ్ గతంలో టీడీపీ నాయకులను విమర్శించలేదని, అందుకే అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని కొడాలి నాని పేర్కొన్నారు. ప్రస్తుతం జనసేన అధినేతను విమర్శించినందుకే ఆయనపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో విమర్శలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించారని, ఇప్పుడు మాత్రం కొత్త చట్టాల పేరుతో గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందన్నారు. రావణ్‌ను వైసీపీ వ్యక్తిగా చూపించే అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలు త్వరలోనే బయటపడతాయని కొడాలి నాని అన్నారు.

# ఓటమిపై గంభీర్ సమాధానాలు

- ప్రశ్నలకు ఘాటు జవాబులు
- జట్టుపై నిజాయితీ విశ్లేషణ

ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో ఘోర ఓటమి అనంతరం భారత ప్రధాన కోచ్ గౌతం గంభీర్ నిర్వహించిన మీడియా సమావేశం ఆసక్తికరంగా సాగింది. వరుస ఓటములపై వచ్చిన ప్రశ్నలకు గంభీర్ నేరుగా సమాధానమిచ్చారు. జట్టు బాగా ఆడలేదనే విషయం స్పష్టమని, నాలుగు ఓటములతో మంచి జట్టు చెడ్డ జట్టుగా మారిపోదని వ్యాఖ్యానించారు. విదేశీ పరిస్థితులకు సరైన రీతిలో అలవాటు పడకపోవడమే ప్రధాన సమస్య అని అంగీకరించారు. యువ బౌలర్ యాదవ్ ప్రదర్శనను ప్రశంసించిన ఆయన, కేవలం రెండు మ్యాచ్‌లతోనే అతడిపై భారీ అంచనాలు పెట్టొద్దని సూచించారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఇంగ్లాండ్ వైట్‌బాల్ క్రికెట్‌లో బలమైన జట్టని గంభీర్ అభిప్రాయపడ్డారు. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగానే జట్టు నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సంజూపై గంభీర్ క్లారిటీ

**జట్టు ప్రయోజనమే ముఖ్యం**

**ఫామ్ ఆధారంగానే నిర్ణయం**




ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో ఘోర ఓటమి తర్వాత సంజూ శాంసన్‌ను తప్పించడంపై భారత ప్రధాన కోచ్ గౌతం గంభీర్ స్పందించారు. జట్టులో చోటు విషయంలో సంజూతో పూర్తి స్పష్టత ఇచ్చామని, ఆ సంభాషణ వ్యక్తిగతమని వెల్లడించారు. గత కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన ప్రదర్శన చేయకపోవడంతోనే సంజూ స్థానంలో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకు అవకాశం ఇచ్చామని చెప్పారు. అంతర్జాతీయ క్రికెట్ లో వ్యక్తుల కంటే జట్టు సమతుల్యత, ఫలితాలకే ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. భారత్‌కు సంజూ చేసిన సేవలు అమూల్యమని, ఈ సిరీస్‌లోనే తిరిగి అవకాశం దక్కే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని పేర్కొన్నారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో జట్టు పరిస్థితులకు సరైన రీతిలో అలవాటు పడలేకపోయిందని, వరుస పరాజయాలకు అదే ప్రధాన కారణమని గంభీర్ అంగీకరించారు.

## ఇమ్రాన్ ఖ్వాజాకు షాక్

**ఐసీసీ ఎన్నికల్లో సంచలనం • ఐసీసీ బోర్డులో కొత్త ముఖాలు**



అంతర్జాతీయ క్రికెట్ మండలి బోర్డు ఎన్నికల్లో అనూహ్య ఫలితం వెలువడింది. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యక్షుడిగా కొనసాగిన ఇమ్రాన్ ఖ్వాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అసోసియేట్ సభ్యుల డైరెక్టర్ల ఎన్నికల్లో ఫ్రాన్స్‌కు చెందిన గురుమూర్తి పలాని 35 ఓట్లతో అగ్రస్థానంలో నిలిచారు. యూఏఈకి చెందిన ముబష్షిర్ ఉస్మానీ, నమీబియాకు చెందిన డాక్టర్ రూడీ వాన్ వురెన్ చెరో 26 ఓట్లతో ఐసీసీ బోర్డులో చోటు దక్కించుకున్నారు. ఖ్వాజా 23 ఓట్లతో నాలుగో స్థానంలో నిలవడంతో బోర్డు సభ్యత్వాన్ని కోల్పోయారు. కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లకు ఐసీసీ చైర్మన్ జై షా అభినందనలు తెలిపారు. అసోసియేట్ దేశాల అభివృద్ధికి వారి సహకారం కీలకమని పేర్కొన్నారు. ఖ్వాజా సేవలను కూడా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.


## అర్జెంటీనా విజయంపై వివాదం




ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా విజయం తర్వాత రిఫరీ, వార్ నిర్ణయాలపై తీవ్ర వివాదం చెలరేగింది. తొలి అర్ధభాగంలో ఈజిప్ట్ ఆటగాడు మొస్తఫా జికో చేసిన గోల్‌ను వార్ సమీక్ష తర్వాత రద్దు చేశారు. గోల్‌కు ముందు జరిగిన ఫౌల్‌ను కారణంగా చూపుతూ రిఫరీ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ సంఘటన గోల్‌కు చాలా ముందే జరిగిందని, గోల్‌ను రద్దు చేయడం సరైంది కాదని మాజీ ఆటగాళ్లు, అభిమానులు విమర్శించారు. చివరి నిమిషాల్లో మొహమ్మద్ సలాహ్‌పై పెనాల్టీ బాక్స్‌లో జరిగిన ఫౌల్‌పై కూడా రిఫరీ పెనాల్టీ ఇవ్వలేదు. వార్ కూడా జోక్యం చేసుకోకపోవడంతో ఈజిప్ట్ శిబిరం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే మ్యాచ్‌లో అర్జెంటీనా ఆటగాళ్ల పలు ఫౌళ్లపై కూడా పసుపు కార్డులు చూపలేదని విమర్శలు వచ్చాయి. అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ విజేత గోల్ నమోదు చేయడంతో అర్జెంటీనా విజయం సాధించినా, రిఫరీ తీర్పులే ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.

## ఫిఫాకు ఈజిప్ట్ ఫిర్యాదు

- రిఫరీపై చర్యల డిమాండ్
- వార్ నిర్ణయాలపై ఆగ్రహం




అర్జెంటీనాతో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో వివాదాస్పద నిర్ణయాలు తమ ఓటమికి కారణమయ్యాయని ఆరోపిస్తూ ఈజిప్ట్ ఫుట్‌బాల్ సమాఖ్య ఫిఫాకు అధికారిక ఫిర్యాదు చేసింది. ఫ్రెంచ్ రిఫరీ ఫ్రాంకోయిస్ లెటెక్సియర్, ఆయన అధికారుల బృందంపై విచారణ చేపట్టాలని కోరింది. టోర్నీలో మిగిలిన మ్యాచ్‌ల నుంచి ఆ రిఫరీ బృందాన్ని తప్పించాలని కూడా విజ్ఞప్తి చేసింది. వార్ సమీక్ష తర్వాత తమ గోల్‌ను రద్దు చేయడం, చివర్లో పెనాల్టీ అప్పీల్‌ను పరిశీలించకపోవడం అన్యాయమని ఈజిప్ట్ పేర్కొంది. కోచ్ హోసామ్ హసన్ కూడా రిఫరీ నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మైదానంలో న్యాయం జరగలేదని, అర్జెంటీనాకు అనుకూలంగా నిర్ణయాలు వచ్చాయని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై ఫిఫా ఎలా స్పందిస్తుందనే అంశం ఇప్పుడు ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఆసక్తికరంగా మారింది.

### అర్జెంటీనాకు ప్రపంచకప్

## రిఫరీపై తీవ్ర విమర్శలు

**వార్ నిర్ణయాలపై అసంతృప్తి**



అర్జెంటీనాతో జరిగిన ఫిఫా ప్రపంచకప్ ప్రీక్వార్టర్ మ్యాచ్ అనంతరం ఈజిప్ట్ స్టార్ ఆటగాడు మోస్తాఫా జికో తీవ్ర ఆరోపణలు చేశారు. 32తో ఓటమి తర్వాత మాట్లాడుతూ, రిఫరీ తీర్పులు పూర్తిగా అర్జెంటీనాకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. తాను చేసిన గోల్‌ను వార్ సమీక్షతో రద్దు చేయడం అన్యాయమని అన్నారు. మొత్తం దేశం చేసిన కృషిని రిఫరీ వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచకప్‌ను అర్జెంటీనాకు ఇవ్వాలని ముందే నిర్ణయించినట్లుగా కనిపిస్తోందని, టోర్నీ నిష్పక్షపాతంగా జరగలేదని ఆరోపించారు. మ్యాచ్ ఆరంభం నుంచే రిఫరీ తమకు వ్యతిరేకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. జికో వ్యాఖ్యలు అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే ఇవి ఆయన వ్యక్తిగత ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలపై ఫిఫా నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు.

### సుకుమార్ స్కూల్ నుంచి

## మరో దర్శకుడు

**బాబీ దర్శకత్వంలో సిద్దూ జొన్నలగడ్డ**






టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ కేవలం విజయవంతమైన సినిమాలు తెరకెక్కించడమే కాకుండా, ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంతకాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్టులలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తి స్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కథను సిద్ధుకు వినిపించగా, ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ కూడా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను కూడా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## అలా కళ్లారా చూసి షాక్ అయ్యాను

**హీరోయిన్ కృతిసనన్ సంచలన విషయాలు వెల్లడి**





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ 'నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్ ను కళ్లారా చూశానో? అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అభిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. , షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

### రాకాను వదులుకున్న

## ప్రీతి ముకుందన్





అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లాస్ట'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.

### నవీన్ పోలిశెట్టి

## సినిమాకు తమిళ దర్శకుడు



ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఆయనతో ఓ సినిమా చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085